www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:92 THURSDAY , AUGUST 20, 2026 PAGES:8 COST: 4/-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 92 గురువారం 20 ఆగష్టు 2026 పేజీలు :8 వెల: 4/-



## రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కూతురు సుస్మిత చేసిన వ్యాఖ్యలపై

# మల్లు రవి స్పందన

**పరకాల టికెట్ మళ్లీ రేవూరి ప్రకాశ్ రెడ్డికే ఇస్తామన్న రేవంత్**

**ఎన్నికలకు చాలా సమయం ఉండగానే టికెట్ ఎలా ప్రకటిస్తారన్న సుస్మిత**

హంసకలం వార్త : తెలంగాణ మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని చేసిన ఘాటు వ్యాఖ్యలు రాష్ట్ర కాంగ్రెస్‌వర్గాల్లో తీవ్ర రాజకీయ దుమారం రేపుతున్నాయి. పరకాల అసెంబ్లీ నియోజక వర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికే రాబోయే ఎన్నికల్లో మళ్లీ టికెట్ ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల ప్రకటించడమే ఈ వివాదానికి ప్రధాన కారణమైంది. పరకాలలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో కొండా సుస్మిత మాట్లాడు తూ, ఎన్నికలకు ఇంకా సమయం ఉండ గానే టికెట్ ఎలా ప్రకటిస్తా రంటూ మిగతా2లో

# రైతుల ఆదాయమే లక్ష్యం

## రైతుల ఆదాయాన్ని పెంచడమే బ్యాంకుల లక్ష్యం



హంసకలం వార్త : స్టేట్ లెవల్ బ్యాంకర్స్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బ్యాంకర్లకు కీలక సూచనలు చేశారు. అర్హత ఉన్న ప్రతి రైతుకూ సకాలంలో రుణాలు అందేలా బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లాలని సూచించారు. రుణాలు ఇవ్వడమే కాకుండా రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగానికి 2026 జూన్ వరకూ రూ.52,337 కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. డెయిరీ, మత్స్య, ఉద్యాన, పామాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు మరింతగా రుణాలు పెంచాలని ఆదేశించారు. రుణం చెల్లించలేని రైతుల ఆదాయం ఎందుకు తగ్గిందో విశ్లేషించి, సమస్యలకు పరిష్కారాలు చూపాలని బ్యాంకర్లకు సూచించారు. మీావీజులకు రుణం మంజూరు చేయడమే కాకుండా సకాలంలో నిధులు అందించడం ముఖ్యమని అన్నారు. CGTMSE కింద రూ.4,463 కోట్ల విలువైన 16,265 ప్రతి పాదనలు ఆమోదించినట్లు వెల్లడించారు. రుణాల కోసం వ్యాపారులను పూచీకత్తు మిగతా2లో

# రహదారుల అభివృద్ధితో

## పరిశ్రమలు, ఉపాధి అవకాశాల విస్తరణ

- ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- గత పదేళ్లలో రూ.900 కోట్ల రహదారి పనులు, ప్రస్తుతం రూ.1,700 కోట్ల పనులు మంజూరు
- ఏడాదిలోపు పెద్దపల్లి బైపాస్ పూర్తి చేసేలా చర్యలు
- హెచ్‌ఏఎం విధానంలో 40 శాతం ప్రభుత్వం, 60 శాతం కాంట్రాక్టర్ భాగస్వామ్యం
- సుల్తానాబాద్ మండలంలో రూ.219 కోట్ల 67 లక్షల విలువైన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ , నాన్‌ప్లాన్ రహదారి అభివృద్ధి పనుల శంకుస్థాపన చేసిన మంత్రి కోమటిరెడ్డి.



హంసకలం వార్త : రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందని, రహదారుల అభివృద్ధితో పరిశ్రమలు, వ్యాపారాలు విస్తరించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలం గరేపల్లిలో బుధవారం రూ.219 కోట్ల 67 లక్షల విలువైన హైబ్రిడ్ మిగతా2లో



## కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల పై హైకోర్టు కీలక వ్యాఖ్యలు..

హంసకలం వార్త : ఉచిత పథకాలు, ప్రజాధనం వినియోగంపై తెలంగాణ హైకోర్టులో బుధవారం కీలక చర్చ జరిగింది. చర్చ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. చట్టబద్ధత లేని పథకాలకు ప్రజాధనం వృథా చేస్తే ఎలా అని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల్లోకి తెచ్చి.. ఆ డబ్బును ఉచిత పథకాలకు ఖర్చు చేయొచ్చు కదా అని ధర్మాసనం అభిప్రాయపడింది. భూసేకరణలో న్యాయం జరగక బాధితులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని హైకోర్టు పేర్కొంది. మిగతా2లో

# సీటు రగడ



## సీఎం రేవంత్‌పై కొండా సుష్మిత సంచలన వ్యాఖ్యలు

**పరకాల టికెట్‌పై రేవంత్‌ను ప్రశ్నించిన కొండా సుష్మిత**

**రేవూరికి టికెట్ ఎలా ఖరారు చేస్తారని నిలదీత**

**టికెట్లను అధిష్ఠానమే నిర్ణయిస్తుందని స్పష్టీకరణ**

**కొండా మురళికి ఎమ్మెల్సీ హామీ ఎందుకు అమలు కాలేదని ప్రశ్నల**

హంసకలం వార్త : తెలంగాణ కాంగ్రెస్‌లో పరకాల అసెంబ్లీ టికెట్ వ్యవ హారం మరోసారి వేడెక్కింది. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల పిలుపునిచ్చారు. 2లో

# ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య కేసులో వీడిన మిస్టరీ

- నల్గొండ ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య కేసులో వీడిన మిస్టరీ
- అదే పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- టీసీ ఇచ్చిందన్న కక్ష, డబ్బు అవసరం కోసమే హత్య జరిగినట్లు ప్రాథమిక నిర్ధారణ
- హత్య తర్వాత ఇంట్లో నుంచి రూ.4 లక్షల నగదు చోరీ జరిగినట్లు అనుమానం



హంసకలం వార్త :నల్గొండ జిల్లాలో సంచలనం సృష్టించిన ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్ కల్లు రూపారెడ్డి హత్య కేసు మిస్టరీ వీడింది. ఈ దారుణ ఘటనకు సంబం ధించి, ఆమె పనిచేస్తున్న పాఠశాలలోనే పదో తరగతి చదువుతున్న విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. టీసీ మిగతా2లో

# భారీ చిత్రాలకు కొత్త రూల్

**తెలంగాణ సర్కార్ కీలక ఉత్తర్వులు**

- టికెట్ ధరల పెంపుపై తెలంగాణ ప్రభుత్వం కొత్త జీవో
- పెంచిన టికెట్ వసూళ్లలో 20% సంక్షేమానికి కేటాయింపు
- టీజీఎఫ్‌డీసీ, సినీ కార్మికుల ఫెడరేషన్‌కు ఈ మొత్తం
- నిర్మాతలు ఎగ్జిబిటర్ల నుంచి వసూలు చేయాలని ఆదేశం
- 'పెద్ది', 'రాజాసాబ్' వంటి భారీ చిత్రాలకు ఈ నిబంధన వర్తింపు

హంసకలం వార్త : భారీ బడ్జెట్ సినిమాల టికెట్ ధరల పెంపు విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టికెట్ ధరల పెంపుద్వారా అదనం గా వచ్చే వసూళ్ల లో 2లో



## కోకాపేటలోని నివాసంలో హరీశ్ రావు హౌస్ అరెస్ట్

**సనత్‌నగర్‌లోని టిమ్స్ ఆసుపత్రి సందర్శనకు పిలుపునిచ్చిన హరీశ్ రావు**

**ముందస్తు జాగ్రత్త చర్యగా హరీశ్ రావును గృహ నిర్బంధం చేసిన పోలీసులు**

**ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు**

హంసకలం వార్త: మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావును పోలీసులు కోకాపేట్‌లోని ఆయన నివాసంలో హౌస్ అరెస్ట్ చేశారు. హైదరాబాద్ సనత్‌నగర్‌లోని టిమ్స్ ఆస్పత్రి ని సందర్శించేందుకు హరీశ్‌రావు పిలుపు నిచ్చారు. ఈ నేపథ్యంలో, అక్కడ ఉద్రిక్త పరిస్థితులు తలెత్త కుండా పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యగా ఆయన ఇంటి నుంచి బయటకు రాకుండా గృహ నిర్బంధం చేశారు. ఈ పర్యటన పిలుపు మిగతా2లో

# రైతుల ఆదాయమే లక్ష్యం

CGTMSE కింద రూ.4,463 కోట్ల విలువైన 16,265 ప్రతిపాదనలు ఆమోదించినట్లు వెల్లడించారు. రుణాల కోసం వ్యాపారులను పూచీకత్తు నిబంధనలతో ఇబ్బంది పెట్టవద్దని స్పష్టం చేశారు. క్యూర్, ప్యూర్, రేర్‌కు అనుగుణంగా ప్రత్యేక బ్యాంకింగ్ వ్యూహాలను రూపొందించాలని భట్టి విక్రమార్క సూచించారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా 'బ్యాంకింగ్ రోడ్‌మ్యాప్' సిద్ధం చేయాలని అన్నారు. 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 1 ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యమని పేర్కొన్నారు. జనధన్ ఖాతాల్లో 19.13 లక్షల ఖాతాలు జీరో బ్యాలెన్స్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రతి గ్రామానికీ బ్యాంకింగ్ సేవలు అందేలా బిజినెస్ కరస్పాండెంట్లను మరింత క్రియాశీలం చేయాలని ఆదేశించారు.

## రహదారుల అభివృద్ధితో పరిశ్రమలు, ఉపాధి అవకాశాల విస్తరణ

సుల్తానాబాద్ మండలం గోపాల్‌పల్లిలో బుధవారం రూ.219 కోట్ల 67 లక్షల విలువైన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్, నాన్‌ప్లాన్ రహదారి అభివృద్ధి పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తో కలిసి శంకుస్థాపన చేసారు. ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పెద్దపల్లి ప్రజలు మంచి నాయకుడిని ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారని, ఎమ్మెల్యే విజయరమణారావు ఎల్లప్పుడూ పెద్దపల్లి అభివృద్ధి గురించే ఆలోచిస్తూ పనిచేస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వం ఏర్పడిన నెలలోపే పెద్దపల్లి బైపాస్ రహదారికి నిధులు మంజూరు చేశామని, ప్రస్తుత పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రస్తుత రాష్ట్రంలో రోడ్లు, భవనాల శాఖ పరిధిలో రూ.13 వేల కోట్లతో, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో రూ.17 వేల కోట్లతో రహదారి పనులు జరుగుతు న్నాయని మంత్రి తెలిపారు. దేశంలో మరే రాష్ట్రంలో నూ ఇంత భారీ మొత్తంలో రహదారి పనులు చేపట్టడం లేదన్నారు. హెచ్ఏఎం విధానంలో ప్రభుత్వం 40 శాతం, కాంట్రాక్టర్ 60 శాతం నిధులు భరించే విధంగా పనులు చేపడుతున్నామని, నేడు శంకుస్థాపన చేసిన రహదారి పనులను రెండు సంవత్సరాల్లో పూర్తి చేస్తామని తెలిపారు. పనులు వారం రోజుల్లోనే క్షేత్రస్థాయిలో ప్రారంభమవుతాయని చెప్పారు. రోడ్డు భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ప్రమాదాల నివారణకు వాహనదారులు, ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. రహదారులు సంక్షేమ పథకాలతో సమానంగా అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం సుమారు రూ.40 వేల కోట్ల పెండింగ్ బిల్లులను వదిలి వెళ్లిందని మంత్రి అన్నారు. హైదరాబాద్ నుంచి రామగుండం వరకు కొత్త గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణంపై కేంద్ర మంత్రితో చర్చలు జరిపామని, ప్రతిపాదిత రహదారిలో సుల్తానాబాద్ బైపాస్‌ను కూడా మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టును గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రాజెక్టును చేపడుతోందని అన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి నుంచి నీటిని ఎత్తిపోసి సాగునీరు అందించడంతో రికార్డు స్థాయిలో సాగు నమోదైందని తెలిపారు. నెహ్రూ హయాంలో నిర్మించిన అనేక ప్రాజెక్టులు ఇప్పటికీ సురక్షితంగా ఉండి లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నాయని పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ విప్ విజయరమణారావు విక్రమార్కుడిలా ప్రజలు, రైతుల కోసం నిజాయితీ, నిబద్ధతతో పనిచేస్తున్నారని అన్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు నాయకత్వంలో సమస్యలను పారదర్శకంగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన మంత్రి పదవిని త్యాగం చేసి ఉద్యమానికి మద్దతుగా నిలిచారని గుర్తు చేశారు. గత పది సంవత్సరాల పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం కఠిన పరిస్థితుల్లోనూ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి తుమ్మల అన్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల మంజూరు వంటి పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా పాఠశాలలు నిర్మిస్తున్నామని, ఆరోగ్యం, విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఇటీవల టిమ్స్ ఆసుపత్రులను ప్రారంభించడంతో పాటు విఫలమైన సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా ఆయిల్‌పామ్ సాగును విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయిల్‌పామ్ పరిశ్రమ ప్రారంభానికి మరో 6 వేల ఎకరాల సాగు అవసరమని తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ, డ్రిప్, స్ప్రింక్లర్, రుణమాఫీ వంటి కార్యక్రమాలకు ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చించిందని, అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచడంతో పాటు రైతుల నుంచి పంటలను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. మొక్కజొన్నను కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ గత పది సంవత్సరాల్లో పెద్దపల్లి జిల్లాలో కేవలం రూ.900 కోట్ల విలువైన రహదారి పనులు మాత్రమే మంజూరయ్యాయని, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.1,700 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరయ్యాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో ఈ అభివృద్ధి సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ రాధాకృష్ణ, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, గోదావరిఖని డిప్యూటీ మేయర్ పారుపల్లి ఎల్లయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్లు మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య కేసులో వీడిన మిస్టరీ

నల్గొండ జిల్లాలో సంచలనం సృష్టించిన ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్ కల్లు రూపారెడ్డి హత్య కేసు మిస్టరీ వీడింది. ఈ దారుణ ఘటనకు సంబంధించి, ఆమె పనిచేస్తున్న పాఠశాలలోనే పదో తరగతి చదువుతున్న విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. టీసీ ఇచ్చిందన్న కక్ష, డబ్బు అవసరం రెండూ ఈ హత్యకు కారణంగా పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. కొండమల్లేపల్లిలోని నాగార్జున పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్, డైరెక్టర్ అయిన రూపారెడ్డి (42) గత వారం జేబీ కాలనీలోని తన నివాసంలో దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆగస్టు 11–12 తేదీల మధ్య జరిగిన ఈ ఘటనలో ఆమె శరీరంపై దుండగులు పదునైన ఆయుధంతో దాదాపు 27 సార్లు పొడిచినట్లు గుర్తించారు. భర్త పని నిమిత్తం హైదరాబాద్‌లో ఉన్న సమయంలో ఈ హత్య జరిగింది. ఆమె ఫోన్ కాల్స్‌కు స్పందించకపోవడంతో, అనుమానంతో బంధువులు, సహోద్యోగులు చూడగా విషయం బయటపడింది. ఘటనా స్థలంలో తొలుత ఎలాంటి విలువైన వస్తువులు చోరీకి గురికాకపోవడంతో ఆమెకు తెలిసిన వారే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానించారు. ఈ క్రమంలో పదుల సంఖ్యలో అనుమానితులను విచారించారు. చివరకు ఇంటి సమీపంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా, ఓ బాలుడు అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు కనిపించడంతో కేసులో పురోగతి లభించింది. ఫుటేజీ ఆధారంగా కొందరు విద్యార్థులను అదుపులోకి తీసుకుని విచారించగా, ఓ విద్యార్థి నేరాన్ని అంగీకరించినట్లు సమాచారం. ప్రిన్సిపాల్ తనకు టీసీ ఇవ్వడంతో ఆమెపై కక్ష పెంచుకున్నానని, అదే సమయంలో డబ్బు కూడా అవసరం కావడంతో ఈ హత్యకు పాల్పడినట్లు నిందితుడు చెప్పినట్లు సమాచారం. హత్య అనంతరం ఇంట్లో నుంచి సుమారు రూ.4 లక్షల నగదు కూడా చోరీకి గురైనట్లు తాజా విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఇద్దరు లేదా ముగ్గురు విద్యార్థుల ప్రమేయం ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. రూపారెడ్డి కుమారుడి ఫిర్యాదు మేరకు కొండమల్లేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు.

## భారీ చిత్రాలకు కొత్త రూల్..

భారీ బడ్జెట్ సినిమాల టికెట్ ధరల పెంపు విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టికెట్ ధరల పెంపు ద్వారా అదనంగా వచ్చే వసూళ్లలో 20 శాతం మొత్తాన్ని సంక్షేమ కార్యక్రమాలకు కేటాయించాలని స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తాన్ని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎఫ్‌డీసీ)కు ఇవ్వాలని ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. 'పెద్ది', 'రాజాసాబ్', 'మనశంకర వరప్రసాద్ గారు', 'అఖండ 2' వంటి చిత్రాలకు ఇది వర్తించనుంది. ఈ సినిమాల టికెట్ ధరల పెంపుతో వచ్చిన కలెక్షన్‌లో 20 శాతాన్ని తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో పాటు, టీజీఎఫ్‌డీసీ ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది. ఈ 20 శాతం వాటాను ఎగ్జిబిటర్ల (థియేటర్ల యజమానులు) నుంచి వసూలు చేసి, సంబంధిత ఖాతాల్లో జమ చేయాల్సిన బాధ్యత నిర్మాతలపై ఉంటుందని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. ఇటీవల విడుదలైన భారీ చిత్రాలతో పాటు భవిష్యత్తులో రాబోయే పెద్ద సినిమాలకు కూడా ఈ నిబంధన కచ్చితంగా అమలు చేయాలని తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిర్ణయంతో సినీ పరిశ్రమలోని కార్మికుల సంక్షేమానికి ఆర్థిక భరోసా లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

## ఆన్‌లైన్ బెట్టింగ్ కేసు..

### విచారణకు నటి నిధి అగర్వాల్

హైదరాబాద్, ఆగస్టు 19: ప్రముఖ నటి నిధి అగర్వాల్‌కి ఆన్‌లైన్ బెట్టింగ్ కేసులో ఈడీ అధికారులు సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈడీ అధికారులు నోటీసులు ఇవ్వడంతో బుధవారం ఈడీ కార్యాలయంలో విచారణకు ఆమె హాజరుకానున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ ప్లాట్‌ఫారమ్‌ను ప్రచారం చేసినట్లు నిధి అగర్వాల్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇవాళ ఆమె స్టేట్‌మెంట్‌ను ఈడీ అధికారులు రికార్డ్ చేయనున్నారు. బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల ప్రచారంలో సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల పాత్రపై సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నారు. మనీ లాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు విచారణ చేస్తున్నారు. మియాపూర్‌కు చెందిన వ్యాపారవేత్త ఫణీంద్ర శర్మ ఫిర్యాదు ఆధారంగా ఈడీ అధికారులు ఈ కేసు నమోదు చేశారు. సెలబ్రిటీలు ప్రకటనల ద్వారా ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లను ప్రమోట్ చేశారని, తద్వారా ప్రజలను అందులో పెట్టుబడి పెట్టేలా ప్రోత్సహించారని తన ఫిర్యాదులో ఫణీంద్ర శర్మ పేర్కొన్నారు. ఈ ఎఫ్ఐఆర్‌లో నటులు రానా దగ్గుబాటి, ప్రకాశ్‌రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మీ, ప్రణీత, అనన్య నాగళ్ల పేర్లతో పాటు పలువురు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల పేర్లను ఈడీ అధికారులు చేర్చారు.

## రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కూతురు సుస్మిత చేసిన వ్యాఖ్యలపై మల్లు రవి స్పందన

ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే టికెట్ ఎలా ప్రకటిస్తారంటూ సీఎం వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కొండా మురళికి ఎమ్మెల్సీ ఇస్తామన్న హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. తన వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తే సీఎం రేవంత్ రెడ్డి, ఆయన అన్నదమ్ముల భాగోతాలు, స్కాములను బయటపెడతానని హెచ్చరించడం ప్రకంపనలు సృష్టించింది. ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి తీవ్రంగా తప్పుపట్టారు. సీఎం ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్న సుస్మిత వ్యాఖ్యలపై పూర్తి సమాచారం తెప్పించుకున్న తర్వాత క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పార్టీలో లక్ష్మణరేఖ దాటి ఎవరు ప్రవర్తించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. మరోవైపు ఈ అంతర్గత వివాదంపై తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షీ నటరాజన్ స్పందిస్తూ, పూర్తి నివేదిక ఇవ్వాలని పీసీసీ నాయకత్వాన్ని ఆదేశించారు. మరోవైపు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి స్పందిస్తూ, పార్టీ అధిష్ఠానం నిర్ణయమే అందరికీ శిరోధార్యమని, అనవసర వివాదాలకు ప్రాధాన్యం ఇవ్వవద్దని తెలిపారు.

## కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు..

ఉచిత పథకాలు, ప్రజాధనం వినియోగంపై తెలంగాణ హైకోర్టులో బుధవారం కీలక చర్చ జరిగింది. చర్చ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. చట్టబద్ధత లేని పథకాలకు ప్రజాధనం వృథా చేస్తే ఎలా అని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల్లోకి తెచ్చి.. ఆ డబ్బును ఉచిత పథకాలకు ఖర్చు చేయొచ్చు కదా అని ధర్మాసనం అభిప్రాయపడింది. భూసేకరణలో న్యాయం జరగక బాధితులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని హైకోర్టు పేర్కొంది. భూ బాధితుల సమస్యలపై ప్రభుత్వం ఏం చేస్తుందో గురువారం చెప్పాలని ఆదేశించింది. తదుపరి విచారణను మరుసటి రోజుకు వాయిదా వేసింది. కాగా, కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్‌పై ఉన్న స్టేను ఎత్తివేయాలని తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాదులు హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ రెండు పథకాల లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్‌పై ఉన్న స్టేను ఎత్తి వేయటంపై హైకోర్టు గురువారం నిర్ణయం తీసుకోనుంది.

## సీటు రగడ.. సీఎం రేవంత్‌పై కొండా సుష్మిత సంచలన వ్యాఖ్యలు

తెలంగాణ కాంగ్రెస్‌లో పరకాల అసెంబ్లీ టికెట్ వ్యవహారం మరోసారి వేడెక్కింది. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల పిలుపునిచ్చారు. దీనిపై మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత తీవ్రంగా స్పందించారు. ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉండగానే అభ్యర్థిని ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. పరకాలలో రేవూరి ప్రకాశ్‌రెడ్డికి మరోసారి టికెట్ ఇస్తామని రేవంత్‌రెడ్డి ఎలా చెబుతారని సుష్మిత నిలదీశారు. పరకాలలో రేవూరి ఎవరికైనా తెలుసా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో టికెట్లను పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని, నేతలు కాదని అన్నారు. తన తండ్రి కొండా మురళిని రేవంత్‌రెడ్డి ఎందుకు పక్కన పెడుతున్నారని సుష్మిత ప్రశ్నించారు. కొండా మురళి సాధారణ నేత కాదని, కింగ్ మేకర్ అని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డికి పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని కాంగ్రెస్‌లో తొలుత కోరింది కొండా దంపతులేనని గుర్తుచేశారు. పీసీసీ చీఫ్ అయిన తర్వాత రేవంత్‌రెడ్డి తమ ఇంటికి వచ్చారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా రాకపోయినా కొండా మురళికి ఎమ్మెల్సీ పదవి ఇస్తామని హామీ ఇచ్చారని సుష్మిత పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఆ హామీ ఎందుకు అమలు కాలేదని ప్రశ్నించారు. సంగారెడ్డి టికెట్‌ను అధిష్ఠానం నిర్ణయిస్తుందని చెప్పిన సీఎం.. పరకాల విషయంలో మాత్రం తానే ఎలా నిర్ణయం చెబుతారని నిలదీశారు. యువతకు టికెట్లు ఇవ్వాలని చెబుతూ రేవూరి ప్రకాశ్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇస్తామని చెప్పడం ఏంటని ఆమె ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి పూటకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. సీఎం పదవిని కాపాడుకోవాలంటే నిబద్ధత అవసరమని వ్యాఖ్యానించారు. బీసీల పట్ల వివక్ష చూపుతున్నారంటూ ఆరోపించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపైనా సుష్మిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మరో 'పొంగు' ఉందని, ఆ పొంగు ఎక్కువ కాలం ఉండదని అన్నారు. ముఖ్యమంత్రి ఎవరో తెలియని పరిస్థితి ఉండటంపై విమర్శించారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారాయి.

## కోకాపేటలోని నివాసంలో హరీశ్ రావు హౌస్ అరెస్ట్

మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావును పోలీసులు కోకాపేట్‌లోని ఆయన నివాసంలో హౌస్ అరెస్ట్ చేశారు. హైదరాబాద్ సనత్‌నగర్‌లోని టిమ్స్ ఆస్పత్రిని సందర్శించేందుకు హరీశ్ రావు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో, అక్కడ ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యగా ఆయన ఇంటి నుంచి బయటకు రాకుండా గృహ నిర్బంధం చేశారు. ఈ పర్యటన పిలుపు నేపథ్యంతో తెల్లవారుజాము నుంచే కోకాపేట్‌లోని ఆయన నివాసం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. హరీశ్ రావు ఇల్లు విడిచి బయటకు రాకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతంలో వాతావరణం వేడెక్కింది. ఈ ఆకస్మిక పరిణామం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారగా... హరీశ్ రావు హౌస్ అరెస్ట్ వార్త తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# సంపాదకీయం

## ఇంధన పంటలకు ఇదే తరుణం!



వచ్చే పదేళ్ల కాలంలో భారత్‌లో అమ్మే అన్ని మోటారు వాహనాలూ ఎలక్ట్రిక్ వెహికిల్స్ మాత్రమే కావాలి. ఒక దశాబ్దకాలంలో మనం దశలవారీగా డీజిల్, పెట్రోల్ వాహనాలను తొలగిస్తూ, వందశాతం ఈవీలకు మళ్లగలిగితే.. మనకు ఏడాదికి 25 కోట్ల టన్నుల భారీ స్థాయి ముడిచమురు అవసరం ఉండదు. బొగ్గు, చమురుపై ఆధారపడటం మానవాళి చరిత్రలో స్వల్పకాలిక దశ మాత్రమే. చివరికి మనకి బొగ్గు, చమురు, గ్యాస్ వనరులు ఖాళీ అవుతాయి. సౌరశక్తిని, జీవపదార్థాన్ని (బయోమాస్) ప్రత్యామ్నాయ ఇంధనంగా మార్చటం మీదే భవిష్యత్తు ఆధారపడి ఉంది. సౌర విద్యుదుత్పత్తి, స్టోరేజీ బ్యాటరీల ద్వారా ఇప్పుడు మనం ఆ ఇంధన స్వప్నానికి మునుపెన్నడూ లేనంత చేరువలోకి వచ్చాం. జీవ పదార్థాన్ని వినియోగ ఇంధనంగా సమర్థవంతంగా మార్చుకోవటానికి కొత్త సాంకేతికతలు ఇప్పుడు మనకో అవకాశాన్నిస్తున్నాయి.

మన వ్యవసాయ సాగుభూమి 170--180 మిలియన్ హెక్టార్లు. మొత్తం ప్రపంచ సాగునేలలో ఇది సుమారు 11శాతం. ఏడాది పొడవునా పంటలకు అనుకూలంగా ఉండేలా పుష్కలమైన సూర్యరశ్మి, ఉష్ణోగ్రతలు మనకున్నాయి. మన రుతుపవనాలు కావలసినంత వర్షపాతాన్ని అందిస్తాయి. మన భూములు సారవంతమైనవి. 1950లో భారత్ సుమారు 5.2 కోట్ల మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాలను మాత్రమే ఉత్పత్తి చేసింది. దీనివల్ల మనం దిగుమతులపై భారీగా ఆధారపడ్డాం. అలాంటిది, ఇప్పుడు మనకు భారీ మిగులు ఉంది. 2024--25లో రికార్డు స్థాయిలో 35.8 కోట్ల మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాలను ఉత్పత్తి చేశాం. దిగుబడుల సమయంలో, మన ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) 8 కోట్ల మెట్రిక్ టన్నుల వరకు గోదాములలో నిల్వ చేస్తోంది. ప్రస్తుతం మన ధాన్యం గిడ్డంగులలో 6 కోట్ల మెట్రిక్ టన్నుల నిల్వలున్నాయి. ఆహారధాన్యాలను ఇలా మనం పెద్దఎత్తున ఉత్పత్తి చేస్తున్నా, వినియోగంలో సమాజం పోకడలు మాత్రం మారిపోయాయి. ప్రజల ఆహారపు అలవాట్లు మారటం, వైవిధ్యభరితం కావటంతో బియ్యం, గోధుమల తలసరి వినియోగం తగ్గిపోయింది. దీంతో మార్కెట్‌లో వాటికి డిమాండ్ పరిమితమైంది. అయినా కూడా ఎప్పుడో కొరతల కాలంలో ప్రవేశపెట్టిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) రూపంలో మార్కెట్ ధర కంటే ఎక్కువ చెల్లించి ప్రభుత్వం బలవంతంగా ధాన్యం కొనాల్సి వస్తోంది. వాటిని ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)లోకి ఇబ్బడిముబ్బడిగా సరఫరా చేస్తోంది. పీడీఎస్‌కి సరఫరా చేసిన ఆహార ధాన్యాలలో సుమారు 40 శాతాన్ని లబ్ధిదారులు మార్కెట్‌లో తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. రీసైక్లింగ్‌తో ఇవి చాలా సందర్భాలలో తిరిగి ఎఫ్‌సీఐకి చేరుతున్నాయి. మరోవంక, ఎంఎస్‌పీ పేరుతో అర్థరహిత ప్రోత్సాహకం ఇస్తుండటంతో రైతులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలకు మళ్లటానికి విముఖత వ్యక్తం చేస్తున్నారు. ఇంధన పంటల పెంపకానికి సరైన రీతిలో రూపకల్పన చేసి అమల్లోకి తెస్తే, అన్ని సమస్యలనూ ఒక్కసారిగా పరిష్కరించగలదు. రైతులకు ఆదాయం పెరగటం, ఆహారధాన్యాల ఉత్పత్తి తగ్గించటం, గ్రామీణ పారిశ్రామికీకరణను ప్రోత్సహించటం, ఇంధన భద్రత కల్పించటం, చమురు, గ్యాస్ దిగుమతులను తగ్గించటం, పర్యావరణాన్ని పరిరక్షించటం.. ఇవన్నీ ఆ ఒక్క మార్పుతో సాధ్యమవుతాయి. ఉదాహరణకు, హైబ్రిడ్ సూపర్ నేపియర్ గ్రాస్‌ను నీటి వనరులున్న వరి సాగు భూముల్లో పండించటం. ఆ గడ్డి పెంపకానికి ఆ తరహా భూములు అనువైనవి. దీనివల్ల, రైతులు ఎకరాకు ఏడాదికి సుమారు 160 మెట్రిక్ టన్నుల తాజా గడ్డిని పండించగలరు. దీన్నుంచి 8 టన్నుల కంప్రెస్ చేసిన బయోగ్యాస్ (సీబీజీ)ను ఉత్పత్తి చేయవచ్చు. ఇది ఎల్‌పీజీ(వంటగ్యాస్)కి ప్రత్యామ్నాయం. అంతేకాదు, జీవ ఇంధన నూనె, జీవ కర్బనం (బయోచార్), జీవ ఇంధన ఎరువు వంటివి ఉత్పత్తి చేసి అమ్ముకోవచ్చు. ఈ రకంగా రైతులు ఎకరాకు రూ.80,000 నుంచి 1,00,000 నికర ఆదాయాన్ని ఆర్జించవచ్చు. ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా వెచ్చించనవసరం లేదు. రైతులకు గ్యారంటీగా, స్థిరంగా మంచి ధర లభించేలా భరోసాకు చర్యలు తీసుకుంటే చాలు (ఉదాహరణకు, తాజా నేపియర్ గడ్డి ఎం.టికి రూ.700--800, ఎండు రకానికి టన్నుకు రూ.3,000 వరకు). కాంట్రాక్ట్ వ్యవసాయ పద్ధతిలో ముడిసరుకు లభ్యతకు ఢోకా లేకుండా సీబీజీ పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలను ఆహ్వానించాలి. ప్రభుత్వం ఇప్పటికే అటువంటి పరిశ్రమలకు పెట్టుబడి వ్యయ (క్యాపెక్స్) రాయితీలు, సీబీజీ కొనుగోలుకు హామీ ఇవ్వటం వంటి రూపాల్లో ప్రోత్సాహకాలను ఇస్తోంది. మనం చేయవలసిందల్లా ఈ ప్రక్రియను విస్తృత స్థాయికి విస్తరించటం. కాంట్రాక్ట్ వ్యవసాయం, ఉత్పత్తుల సేకరణకు విధివిధానాలను రూపొందించటం, ముడిసరుకును పరిశ్రమలకు అంతరాయం లేకుండా సరఫరా చేయటం, రైతులకు న్యాయమైన ధర వచ్చేట్లు భరోసా ఇవ్వటం. ఈపాటి ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో చేస్తే, పదుల లక్షల ఎకరాల పల్లపు భూమిలో వరి లాంటి పంటలకు బదులు ఇంధనాన్ని ఉత్పత్తి చేయవచ్చు.

మనం భారత్‌లో 11.5 కోట్ల ఎకరాలలో వరి పండిస్తున్నాం. ఇందులో రెండు శాతం-- సుమారు 25 లక్షల ఎకరాల భూమిని గనక నేపియర్ గ్రాస్ సాగుకు పూర్తిస్థాయిలో మళ్లించగలిగి, దాన్ని కంప్రెస్ చేసిన బయోగ్యాస్ (సీబీజీ)గా మార్చగలిగితే సూర్యరశ్మి పుష్కలంగా ఉన్న మన భూముల్లో 2 కోట్ల టన్నుల సీబీజీని ఏటా ఉత్పత్తి చేయగలం.

# డీలిమిటేషన్‌ను అడ్డుకుంటే దక్షిణాదికి ద్రోహమే!




ఈ పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు దేశ ప్రజాస్వామ్యానికి, ఆంధ్రప్రదేశ్ సహా దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ఉనికికి అత్యంత కీలకమైనవి. గత సమావేశాల్లో రాజకీయ పంతాలకే ప్రాధాన్యమిచ్చిన కాంగ్రెస్, తృణమూల్, డీఎంకే, సమాజ్‌వాదీ వంటి విపక్షాల సంకుచిత వైఖరి వల్ల 131వ రాజ్యాంగ సవరణ-- డీలిమిటేషన్ బిల్లు ఆగిపోయింది. ప్రస్తుత సమావేశాల్లో ఎన్డీఏ ప్రభుత్వం డీలిమిటేషన్ బిల్లును అధికారిక ఎజెండాలో పెట్టనప్పటికీ, సప్లిమెంటరీ బిల్లు రూపంలో తెచ్చే అవకాశాలు ఉన్నాయి. విపక్షాలు మళ్లీ ఏకతాటిపైకి వచ్చి అడ్డుకోకుండా ఉండేందుకే ప్రభుత్వం ఈ వ్యూహాత్మక నిశ్శబ్దాన్ని పాటిస్తోంది. లోక్‌సభలో శివసేన షిండే గ్రూపునకు చెందిన ఆరుగురు ఎంపీలకు విడిగా గ్రూప్ హోదా దక్కడం, తృణమూల్ కాంగ్రెస్ విలీనవర్గం ఆమోదం పొంది ప్రత్యేక గ్రూపుగా గుర్తింపు రావడం, శరద్ పవార్ వర్గం కూడా బిల్లుకు అనుకూలంగా ఓటు వేసే దిశగా అడుగులు వేస్తుండటం, విపక్ష కూట మిలోని డీఎంకే ఓటింగ్‌కు దూరంగా ఉండాలనే యోచనలో ఉండటం వంటి పరిణామాలు సభలో సరికొత్త రాజకీయ చిత్రపటాన్ని ఆవిష్కరించాయి. తాజా రాజకీయ లెక్కల ప్రకారం.. షిండే గ్రూప్, టీఎంసీ శకలాలు, స్వతంత్రులు, చిన్న పార్టీలు కలుపుకుని ఎన్డీఏ వైపు 315 నుంచి 319 మందిని దాటి బలంగా ఉండటంతో విపక్షాల పాత వ్యూహాలు ఇక సాగవు.

జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ స్థానాల పునర్విభజన జరిగితే, జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయన్న ఆందోళన పాతదే. రాజ్యాంగంలోని ఆర్టికల్ 81 ప్రకారం, లోక్‌సభ స్థానాల కేటాయింపు జనాభా ప్రాతిపదికన జరగాలి. 1976లో ఇందిరాగాంధీ 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 1971 జనాభా లెక్కల ఆధారంగా సీట్ల సంఖ్యను 2000 సంవత్సరం వరకు స్తంభింపజేశారు. 2001లో వాజపేయి హయాంలో అప్పటి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ తీసుకొని, కుటుంబ నియంత్రణ పాటించినందుకు దక్షిణాది రాష్ట్రాలను రాజకీయంగా శిక్షించకూడదని గట్టిగా వాదించి, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి 84వ రాజ్యాంగ సవరణలో కీలకపాత్ర వహించారు. తద్వారా ఈ స్తంభనను మరో 25 ఏళ్లు-- 2026 తర్వాత జరిగే మొదటి జనాభా లెక్కల వరకు పొడిగించారు. ఆ చారిత్రక చొరవ వల్లనే గత పాతికేళ్లుగా దక్షిణాది రాష్ట్రాల రాజకీయ బలం, జాతీయ స్థాయి ప్రాధాన్యం రక్షించబడుతూ వచ్చాయి. ఆర్టికల్ 81(3) నిబంధన ప్రకారం, 1971 నాటి జనాభా లెక్కల ఆధారంగా ఉన్న సీట్ల స్తంభన 2026తో ముగుస్తుంది. తదుపరి జనాభా లెక్కల తర్వాత డీలిమిటేషన్ అనివార్యం అవుతుంది. 2011 జనాభా లెక్కలను లేదా భవిష్యత్ జనాభా గణాంకాల ఆధారంగా సీట్ల పునఃకేటాయింపు చేస్తే ఘోరమైన అసమతుల్యత ఏర్పడుతుంది. జనాభా విస్ఫోటనంతో ఉత్తరాది రాష్ట్రాల సీట్లు భారీగా పెరిగి, జనాభాను క్రమశిక్షణతో అదుపు చేసిన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక వంటి రాష్ట్రాల సీట్ల శాతం జాతీయ స్థాయిలో దారుణంగా పడిపోతుంది. లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచకుండా పాత 543 స్థానాల పరిమితిలోనే పునర్విభజన చేస్తే, తమిళనాడు సీట్లు 39 నుంచి 32కి, కేరళ సీట్లు 20 నుండి 15కి తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఇది సమాఖ్య స్ఫూర్తికే తీరని విఘాతం.

ఈ భౌగోళిక-- రాజకీయ అసమతుల్యతను నివారించడానికి ఎన్డీఏ ప్రతిపాదించిన న్యాయ బద్ధమైన రాజ్యాంగ రక్షణ కవచం-- లోక్‌సభ మొత్తం స్థానాల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 543 నుంచి గరిష్ఠంగా 850 లేదా 50శాతం అదనపు స్థానాలకు పెంచడం అనే మోడల్-- ఓడిపోయింది. కేంద్రం తెచ్చిన 'ప్రొపోర్షనల్ ఇంక్రీజ్ మోడల్' (సమాన నిష్పత్తి పెంపుదల విధానం) ప్రకారం జాతీయ స్థాయిలో ఏ రాష్ట్రానికి ప్రస్తుతం ఎంత శాతంలో ఎంపీ సీట్ల ప్రాతినిధ్యం ఉందో, పార్లమెంట్ విస్తరణ తర్వాత కూడా అదే శాతం ప్రాతినిధ్యం కొనసాగుతుంది. అంటే ఎవరి జాతీయ వాటా తగ్గకుండా అందరికీ సీట్లు పెరుగుతాయి.

ఈ బిల్లు ప్రకారం, విస్తరణ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత 25 లోక్‌సభ స్థానాలు 38కి, తెలంగాణలో 17 నుంచి 26 సీట్లకు, తమిళనాడులో 39 నుంచి 59 సీట్లకు పెరుగుతాయి. ప్రస్తుతం దక్షిణాదికి ఉన్న 129 లోక్‌సభ స్థానాలు ఏకంగా 195 స్థానాలకు పెరుగుతాయి. దీనివల్ల పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల మొత్తం ప్రాతినిధ్యం దాదాపు 24 శాతంగానే స్థిరంగా, ఉత్తరాది రాష్ట్రాల పెరిగిన జనాభాకు ప్రాతినిధ్య న్యాయం జరుగుతుంది. అదే సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించిన దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాధాన్యానికి ఎలాంటి భంగం కలగదు. ఇది అసలైన 'విన్--విన్' పరిష్కారం. కానీ కాంగ్రెస్, దాని విపక్ష కూటమి పట్టుదలకు పోయి వాకౌట్ చేయడంతో, మూడింట రెండొంతుల ప్రత్యేక మెజారిటీ లేక బిల్లు ఆగిపోయింది.

ఈ ఓటమిపై దేశవ్యాప్తంగా పెద్దఎత్తున చర్చ జరిగింది. విపక్షాల బాధ్యతారాహిత్య చర్య వల్ల దక్షిణాది సాధించింది ఏమీ లేదనే సత్యం ప్రజలకు అర్థమైంది. బహిరంగంగా దక్షిణాది ప్రయోజనాల గురించి మాట్లాడే కాంగ్రెస్, డీఎంకే వంటి పార్టీలు రాజకీయంగా మాత్రం దక్షిణాదిని రక్షించే ఏకైక నిర్మాణ వ్యవస్థను ధ్వంసం చేయడం.. వారి అంతర్గత వైరుధ్యాన్ని బయటపెట్టింది. కేవలం గుడ్డి వ్యతిరే కతతో, దేశ ప్రయోజనాలను, ముఖ్యంగా దక్షిణాది ప్రయోజనాలను, పణంగా పెట్టడానికి కూడా కాంగ్రెస్ వెనుకాడటం లేదు. దీనికి భిన్నంగా తెలుగుదేశం పార్టీ మొదటి నుంచీ ఈ బిల్లుకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ, ప్రాంతీయ ప్రయోజనాలతో పాటు జాతీయ సమగ్రతను కాపాడేలా అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించింది.

గత సమావేశాల ఓటమినీ, తదనంతర పరిణా మాలను నేపథ్యంగా ఉంచుకుని, ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలు కేవలం ఆర్థిక కేటాయింపులకే పరిమి తం కాకుండా, దేశ సమాఖ్య స్ఫూర్తిని రక్షించే డీలిమిటేషన్ సవరణపై పునఃచర్చకు వేదిక కావాలి. విపక్షాలు తమ పాత పంతాలను పక్కనబెట్టి, జాతీయ సమ్మతిని సాధించడానికి ముందుకు రావాలి. ఈ సెషన్‌లో ప్రధానంగా మూడు అంశాలపై ఉభయసభల్లో చర్చ జరగాలని తెలుగుదేశం పార్టీ కోరుకుంటోంది. ఒకటి, 50శాతం ప్రొపోర్షనల్ సీట్ల పెంపుదలను రాజ్యాంగ సవరణ బిల్లులో అంతర్భాగంగా చేర్చి, దక్షిణాది రాష్ట్రాల జాతీయ ప్రాతినిధ్య శాతం తగ్గదని చట్టబద్ధమైన గ్యారెంటీ ఇవ్వడం. రెండు, నియోజకవర్గాల సంఖ్య పెరగడం వల్ల ప్రతి ఎంపీ పరిధిలోని జనాభా భారం తగ్గి, ప్రజలకు-- ప్రజాప్రతినిధికి మధ్య దూరం తగ్గడం. మూడు, 2023లో ఆమోదించిన 'నారీ శక్తి వందన్ అధినియం' అమలు కావాలంటే చట్టసభల్లో 33శాతం స్థానాలు మహిళలకు దక్కాలంటే, డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తి కావడం సాంకేతికంగా అత్యంత అవసరం. ఈ బిల్లును అడ్డుకోవడం అంటే మహిళల చట్టసభల హక్కును కాలరాయడమే. ప్రొపోర్షనల్ సీట్ల పెంపు మోడల్ ఫెడరల్ వ్యవస్థకు రక్షణ కవచం. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ఇప్పటికైనా సంకుచిత పంథాను మార్చుకొని, దక్షిణాది ప్రయోజనాల రక్షణ కోసం, మహిళా సాధికారత కోసం ఈ పార్లమెంటు సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలి. ఈ సమావేశాలలోనే దీన్ని అనుబంధ బిల్లు రూపంలో ఎజెండాలోకి తెచ్చి ఆమోదింపజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# రాజకీయ కథనాల తీరు మారాలి

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంత గొప్పదో, ఓటు వేయడానికి వెళ్లే ముందు ప్రజలు ఏ అంశం గురించి ఆలోచిస్తారన్నది కూడా అంతే గొప్ప విషయం. ఎన్నికలప్పుడు ప్రజల మనస్సుల్లో ఏ ప్రశ్నను ప్రధాన సమస్యగా నిలబెట్టగలిగారన్న దానిపైన విజయం లభిస్తుంది. రాజకీయ శాస్త్రంలో దీనినే 'రాజకీయ కథనం' అంటారు. ఇది ఓటర్‌ను నవ్విస్తుంది, కోపం తెప్పిస్తుంది, భావోద్వేగానికి గురిచేస్తుంది. చివరకు అతని ఓటు ఎటు పడాలో కూడా అదే ప్రభావితం చేస్తుంది. అందుకే ప్రజాస్వామ్యంలో అసలు పోటీ పార్టీల మధ్య కంటే, కథనాల మధ్యనే ఎక్కువగా జరుగుతుంది. గత మూడు దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రాల రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే ఈ వాస్తవం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ప్రతి ఎన్నికకు ఒక కొత్త కథనం తయారైంది. 1990లలో హైటెక్, సంస్కరణలు, ఐటీ విప్లవం ప్రధాన రాజకీయ చర్చగా నిలిచాయి. 2004 తర్వాత జలయజ్ఞం, రైతు సంక్షేమం, ఉచిత విద్యుత్ వంటి అంశాలు ప్రజల ఆలోచనలను ఆక్రమించాయి. తెలంగాణ ఉద్యమ సమయంలో నీళ్లు--నిధులు--నియామకాలు, ఆత్మగౌరవం, ప్రత్యేక రాష్ట్రం అనే నినాదాలు కోట్లాది మందిని కదిలించాయి. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి, ప్రత్యేక హోదా, మూడు రాజధానులు, సంక్షేమ పథకాలు, వాలంటీర్ వ్యవస్థ రాజకీయ చర్చకు కేంద్రబిందువయ్యాయి. తెలంగాణలో కాళేశ్వరం, రైతుబంధు, హైడ్రా, ఫోన్ ట్యాపింగ్, పార్టీల మధ్య వ్యక్తిగత ఘర్షణలు ప్రధాన కథనాలుగా మారాయి. ఈ కథనాలన్నింటిలోనూ కొంత ప్రజా ప్రయోజనం ఉంది. కానీ కాలక్రమేణా విధానాలపై జరిగే రాజకీయ చర్చ క్రమంగా వ్యక్తుల చుట్టూ తిరిగే రాజకీయంగా మారిపోయింది.

టెలివిజన్ చర్చలు, సోషల్ మీడియా పోస్టులు, యూ ట్యూబ్ వీడియోలు చూస్తే ఈ ధోరణి స్పష్టంగా కనిపిస్తుంది. ఎవరు ఎవరిని తిట్టారు లేదా అవమానించారు తదితర అంశాలే రోజులు, వారాలు, నెలల తరబడి ప్రజల ముందుంటాయి. సోషల్ మీడియా సైన్యాలతో పార్టీలు రాజకీయ యుద్ధాలు చేస్తున్నాయి. ప్రజలను అసలు సమస్యల నుంచి పక్కదారి పట్టిస్తున్నాయి. ఈ రాజకీయ కోలాహలం మధ్య కొన్ని ప్రశ్నలు మాత్రం ఎప్పుడూ బయటే నిలబడిపోతాయి. బీసీ రక్షణ చట్టం ఎందుకు రాలేదు? స్థానిక సంస్థల్లో బీసీలు, బీసీ ముస్లింలకు 34 శాతం లేదా 42 శాతం రిజర్వేషన్ ఎందుకు అమలు కాలేదు? దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఎప్పుడు లభిస్తుంది? రెండో విడత కులగణనలో ప్రత్యేక కుల కోడ్‌లు ఎందుకు ఇవ్వడం లేదు? ఆదివాసీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి ఎక్కడ ఉంది? పోలవరం నిర్వాసిత ఆదివాసీలకు సాగునీటి భూమి ఎందుకు ఇవ్వడం లేదు? ప్రభుత్వ పాఠశాలల్లో ప్రపంచ స్థాయి విద్య, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం ఎందుకు అందుబాటులోకి రావడం లేదు? విశాఖ ఉక్కు కర్మాగారం భవిష్యత్తు ఏమిటి? అన్నింటికంటే ముఖ్యంగా శాసనసభల్లో, మంత్రివర్గాల్లో, పాలనా వ్యవస్థలో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, ముస్లింలు, క్రైస్తవులకు వారి జనాభాకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం ఉందా అనే ప్రశ్న ఎన్నికల ప్రధాన చర్చగా ఎందుకు మారడం లేదు?

ఇక్కడే రాజకీయ కథనం అసలు స్వరూపం అర్థమవుతుంది. రాజకీయాల్లో బలమైన పార్టీలు, వాటి ప్రచార వ్యవస్థలు, మీడియా నిర్వహణ, సోషల్ మీడియా సేనలు కలిసి ప్రజల దృష్టి ఏ అంశాలపై నిలవాలో నిర్ణయిస్తాయి. ఇది ప్రజాస్వామ్యంలో కొంతవరకు సహజమే. అయితే తెలుగు రాష్ట్రాల్లో మరో ప్రత్యేకత కనిపిస్తుంది. దశాబ్దాలుగా అధికార రాజకీయాలను ప్రధానంగా ఆధిపత్య సామాజిక వర్గాలకు చెందిన నాయకత్వమే ప్రభావితం చేస్తోంది. ఫలితంగా ఎన్నికల కథనాలు కూడా వారి రాజకీయ ప్రాధాన్యాలకు అనుగుణంగానే రూపుదిద్దుకుంటున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ప్రజల దృష్టి వ్యక్తిగత ఘర్షణలు, భావోద్వేగ అంశాలు, కక్షపూరిత వివాదాలపై నిలిచినంతకాలం సామాజిక న్యాయం, రాజకీయ వాటా, అధికార భాగస్వామ్యం, రాజ్యాంగ హక్కులు వంటి మౌలిక ప్రశ్నలు ప్రజా చర్చకు దూరంగా వెళ్లిపోతాయి. దీనివల్ల ఇప్పటికీ రాజకీయంగా బలమైన శక్తులకు అనుకూల పరిస్థితులు కొనసాగు తున్నాయి. మరోవైపు రాజకీయ ప్రాతినిధ్యం కోసం ఇంకా ఎదురుచూస్తున్న సామాజిక వర్గాల సమస్యలు ఎన్నికల అజెండాలోకి రావు.




తెలుగు రాష్ట్రాల్లో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, ముస్లింలు, క్రైస్తవులు ఎన్నికల్లో అత్యంత చురుకుగా పాల్గొంటారు. సభలు నింపేది, పార్టీ జెండాలు మోసేది, ఇంటింటికీ తిరిగి ప్రచారం చేసేది, ప్రభుత్వాలను ఏర్పాటు చేసేది కూడా వారే. కానీ నిర్ణయాలు తీసుకునే వేదికలపై వారి భాగస్వామ్యం ఎంత అన్న ప్రశ్న మాత్రం పెద్దగా వినిపించదు. ఇదే ప్రాతినిధ్య లోటు.

అందుకే ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో మారాల్సింది కేవలం ప్రభుత్వం కాదు, రాజకీయ కథనం కూడా. ప్రజలు అడిగే ప్రశ్నలు మారాలి. 'ఎవరు గెలుస్తారు?' అనే ప్రశ్నతో పాటు "బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, ముస్లింలు, క్రిస్టియన్లు పాలనలో భాగస్వాములు అవుతున్నారా?" అనే ప్రశ్న కూడా ఎన్నికల కేంద్రబిందువుగా మారాలి. బీసీ రక్షణ చట్టం, స్థానిక సంస్థల్లో రాజ్యాంగబద్ధమైన బీసీ రిజర్వేషన్లు, కులగణన పూర్తి స్థాయిలో అమలు, దళిత క్రైస్తవులకు న్యాయం, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, పోలవరం నిర్వాసితులకు గౌరవప్రదమైన పునరావాసం, ప్రభుత్వ విద్యా--వైద్య వ్యవస్థల బలోపేతం వంటివి ఎన్నికల ప్రధాన చర్చగా మారాలి. అలాగే ప్రజారంగ సంస్థల పరిరక్షణ, శాసనసభలు, మంత్రివర్గాలు, పాలనా వ్యవస్థల్లో సముచిత సామాజిక ప్రాతినిధ్యం, రాజకీయ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం వంటివి కూడా ప్రధాన చర్చగా మారినప్పుడే ప్రజాస్వామ్యం మరింత అర్థవంత మవుతుంది.

# శ్రీ రెడ్డి సతీష్ అరోరా జన్మదిన వేడుకలు ఘనంగా





( ఆగస్టు -19- హంసకలం వార్త )

కేక్ కటింగ్, స్వీట్స్ పంపిణీ కూకట్‌పల్లి: బీఆర్ఎస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీ రెడ్డి సతీష్ అరోరా జన్మదినాన్ని పురస్కరించుకుని కేపీహెచ్‌బీ టెంపుల్ బస్‌స్టాప్ వద్ద జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. వలవల నాయుడు, శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తాజా మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, పగడాల బాబురావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు కేక్ కట్ చేసి సతీష్ అరోరాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్వీట్స్ పంపిణీ చేశారు. సతీష్ అరోరా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరిన్ని సంవత్సరాలు ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రభాకర్ గౌడ్, కృష్ణారెడ్డి, కె. పవన్ కుమార్, పులి మురళి, రాజశేఖర్ రెడ్డి, శరత్ కుమార్, చిక్కం వంశీ, సత్య ప్రకాష్, వెంకటేష్ చౌదరి, రాజేష్ రాయ్, సాయి శ్రీనివాస్, రాంబాబు నాయుడు, ఉపేందర్ రెడ్డి, శివారెడ్డి, తులసి రెడ్డి, జీఎల్ఎన్ రెడ్డి, ప్రకాష్, జాన్ మోజెస్, దినేష్, భార్గవ్, రవీందర్ రెడ్డి, రమణారెడ్డి, బాలాజీ, నారాయణ, తులసి, నాగేశ్వరరావు, తిరుపతిరావు, ఎన్‌వీవీ సత్యనారాయణ, భాస్కర్ నాయి, బాలు, మూర్తి, యశ్వంత్, ఆనంద్, కిషోర్, పృధ్వి, రమణ, శివ, జహంగీర్, ధనలక్ష్మి, భవాని, కన్నులత, రమాదేవి, పద్మ, హేమ, శారద, లలిత తదితరులు పాల్గొన్నారు.

# పెద్దవేడులో నూతన పాఠశాల, అంగన్వాడీ భవనాలు ప్రారంభం

( ఆగస్టు -19- హంస కలంవార్త )






అమెజాన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణం.. ఎమ్మెల్యే కాలే యాదయ్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన రెడ్డి ప్రారంభం షాబాద్ మండలం పెద్దవేడు గ్రామంలో అమెజాన్ సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనం, అంగన్వాడీ భవనాలను చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన భవనాలను ప్రారంభించి విద్యార్థులు, చిన్నారులకు మెరుగైన విద్యా, మౌలిక వసతులు అందుబాటులోకి రావడం పట్ల నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా సంస్థలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ జోనల్ మేనేజర్ జ్యోతి, ఎంఆర్ఓ, ఎంపీడీఓ, ఎంఈఓ, గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెంటారెడ్డి, సర్పంచులు, అమెజాన్ సంస్థ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు

# హైడ్రా చేపట్టిన చెరువుల అభివృద్ధి భేష్





(ఆగస్టు -19- హంసకలం వార్త )

హైడ్రా పనులకు జాతీయ డ్యామ్ సేఫ్టీ నిపుణుల కమిటీ కితాబు నగరంలో హైడ్రా ఆధ్వర్యంలో చేపడుతున్న చెరువుల పునరుద్ధరణ, అభివృద్ధి కార్యక్రమాలను జాతీయ డ్యామ్ సేఫ్టీ నిపుణుల కమిటీ ప్రశంసించింది. క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి చెరువులోకి వరద నీరు చేరేలా ఇన్‌లెట్లు, చెరువు నిండిన అనంతరం నీరు దిగువకు వెళ్లేలా ఔట్‌లెట్ల అభివృద్ధి, పటిష్టమైన బండ్‌ల నిర్మాణం వంటి చర్యలు చేపట్టడం అభినందనీయమని పేర్కొంది. చెరువుల సహజ లక్షణాలను పరిరక్షిస్తూ హైడ్రా చేపడుతున్న అభివృద్ధి పనులు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని కమిటీ సభ్యులు కొనియాడారు. న్యూఢిల్లీకి చెందిన జాతీయ డ్యామ్ సేఫ్టీ నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ శైలేష్ కుమార్ శ్రీవాస్తవ నేతృత్వంలోని సభ్యులు బుధవారం నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి ఫాక్స్ సాగర్ సరస్సును సందర్శించారు. ఈ సందర్భంగా సరస్సు ప్రధాన కట్ట (మెయిన్ బండ్)ను పరిశీలించి, ప్రస్తుత పరిస్థితి, కట్ట భద్రతకు సంబంధించిన అంశాలను సమీక్షించారు. ఫాక్స్ సాగర్ సరస్సు ఎఫ్‌టీఎల్ పరిధి 482.6 ఎకరాలు కాగా, సరస్సు పరిరక్షణ, పునరుద్ధరణకు సంబం ధించి హైడ్రా రూపొందించిన ప్రణాళికను విమోస్ టెక్నోక్రాట్స్ డైరెక్టర్ యూనస్ వివరించారు. సరస్సు సరిహద్దుల పరిరక్షణ, ప్రజా ఆస్తుల రక్షణ, పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ అభివృద్ధి చర్యలను కమిటీ సభ్యులకు వివరించారు. హైడ్రా ఫేజ్-3లో భాగంగా చేపడుతున్న పెద్ద సరస్సుల అభివృద్ధి కార్యక్రమంలో ఫాక్స్ సాగర్ సరస్సును అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. చెరువు పునరుద్ధరణ, సంరక్షణ, నీటి నిల్వ సామర్థ్యాన్ని కాపాడటం, సరస్సు పరిసరాలను పరిరక్షించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. ప్రజా ఆస్తుల పరిరక్షణతో పాటు చెరువులు, సరస్సుల పునరుద్ధ రణకు హైడ్రా చేపడుతున్న కార్యక్రమాలను జాతీయ డ్యామ్ సేఫ్టీ నిపుణుల కమిటీ సభ్యులు అభినంది ంచారు. హైదరాబాద్‌లోని సరస్సులను పరిరక్షించి, భవిష్యత్ తరాలకు వాటిని సురక్షితంగా అందిం చేందుకు హైడ్రా చేస్తున్న కృషిని ప్రశంసించారు.

# రాజకీయాలకు అతీతంగా నగర అభివృద్ధి సాగాలి

- ఎమ్మెల్యే గంగుల కమలాకర్.

(ఆగస్టు -19- హంసకలం వార్త )

నగర అభివృద్ధిని రాజకీయాలకు అతీతంగా, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు తీసుకెళ్లాలని కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. పార్టీలకు తావు లేకుండా కేవలం నగర అభివృద్ధి ఒక్కటే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.?కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మున్సిపల్ కమిషనర్ కపుల్ దేశాయ్, ఇంజనీర్ అధికా రులతో కలిసి నగర అభివృద్ధిపై ఆయన సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో ప్రస్తుతం నెలకొన్న వివిధ ప్రజా సమస్యలపై చర్చించి, వాటికి తక్షణ పరిష్కారం చూపే దిశగా అధికారులకు స్పష్టమైన మార్గనిర్దేశం చేశారు.?నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ ఎక్కడా లోపించకుండా ఎప్పటికప్పుడు పకడ్బ ందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా ఎలక్ట్రికల్ సదుపాయాలను మెరుగుపరచడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని సూచిం చారు. వర్షాకాలం నేపథ్యంలో వర్షపు నీటితో లోతట్టు ప్రాంతాలు జలమ యం కాకుండా ముందస్తుగా అప్రమ త్తం కావాలన్నారు. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి తగిన నివారణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిష నర్‌ను కోరారు. నగరంలో విలీనమైన గ్రామాల అభివృ ద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని, ఆయా ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి మౌలిక వసతులు కల్పించాలని చొరవ చూపాలని చెప్పారు. స్మార్ట్ సిటీ, యూడీఐఎఫ్ (UDIF), యూసీఎఫ్ (UCF) నిధులను ఏ ఒక్క డివిజన్‌కు పరిమితం చేయకుండా ప్రతి డివిజన్‌కూ సమానంగా కేటాయించి సమగ్రంగా అభివృద్ధి చేయాలని




స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్‌తో పాటు బీఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ గౌడ్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, కార్పొరేటర్లు నలువాల రవీందర్, గుగ్గిల్లపు జయశ్రీ, సుధగోని మాధవి, జమ్ము, యూసుఫ్, అలీ, గడ్డి ప్రదీప్, మల్లేశం, పలువురు మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ భూములను అందరం కలిసి కాపాడుకుందాం

-భూముల పరిరక్షణ కమిటీ పిలుపు.



( ఆగస్టు - 19- హంస కలంవార్త )

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్లో కొలువైన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన భూములను కాపాడుకుందాం అని కోరుతూ నేడు దేవాలయం వద్ద దేవాలయ భూముల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం సందర్భంగా జగద్గిరిగుట్టలోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన 14 ఎకరాల ఆరు గుంటల ప్రభుత్వ స్థలం నేడు అన్యాక్రాంతమవుతుందని గత కొద్ది సంవత్సరాల నుంచి పోరాడుతున్నప్పటికీ ఎవరు పట్టించుకోకపోవడం వల్ల ఉన్న స్థలం కూడా కోల్పోయే ప్రమాదం ఉన్నందున జగద్గిరిగుట్ట ప్రజలందరూ కలిసి ఈ స్థలాన్ని కాపాడు కోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సినటువంటి ప్రజలచే ఎన్నుకోబడ్డ ప్రజాప్రతినిధులు గాని, రాజకీయ పార్టీల నాయకులు గాని, రెవెన్యూ అధికారులు కానీ కనీసం స్పందించడం లేదని అందుకే ప్రజలందరిని కలుపుకొని ఈ భూముల పరిరక్షణ కోసం ఉద్యమిస్తామని అన్నారు. స్థానిక రెవెన్యూ అధికారులకు అనేకసార్లు విజ్ఞప్తులు ఇచ్చినప్పటికీ వారు చేస్తున్నామని చెప్పి కూల్చకపోవడమనేది రెవెన్యూ అధికారులే ప్రోత్సహిస్తున్నట్టు కనిపిస్తోందని కమిటీ అభిప్రాయపడింది. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు ఎలాంటి రాజకీయ ఒత్తిడిలోకి లొంగకుండా వెంటనే అక్కడ ఏర్పడ్డ అక్రమ నిర్మాణాలను కూల్చివేసి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాల్సిందిగా డిమాండ్ చేశారు. హైకోర్టు చెప్పినప్పటికీ కలెక్టర్ గారికి మరియు ఎమ్మార్వో కు వినతి పత్రం ఇచ్చినప్పటికీ కనీస స్పందన లేకపోవడం దురదృష్టకరమని, కొత్తగా వచ్చిన రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యమో లేక స్వార్థం వల్లో ఆగిన కబ్జాలు మళ్ళీ మొదలయ్యాయని ఇప్పటికైనా వాటిని ఆపకపోతే ప్రజల దృష్టిలో వారు కబ్జాదారులకు సహకరించినట్టేనని భావిస్తారన్నారు. దేవాలయ స్థలాలను కాపాడుకోవడానికి ప్రజలందరూ స్వచ్ఛందంగా తరలివచ్చి మా ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరారు. దేవాలయ భూముల పరిరక్షణ కొరకు శనివారం నాడు సంతకాల సేకరణ, ఆదివారం నాడు రిలే నిరాహార దీక్షలు మొదలు చేసి అధికారులపై ఒత్తిడి తీసుకొస్తామని దానికి ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, జనసేన స్థానిక నియోజకవర్గం ఇంచార్జ్ నందగిరి నాయకులు సతీష్, బిజెపి నాయకులు మాధవులు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి హరినాథ్ రావు రాములు ఏఐటీయుసీ కార్యదర్శి శ్రీనివాస్ కోశాధికారి సదానంద్ ప్రజానాట్య మండల అధ్యక్షులు బాబు, ప్రవీణ్ సాహు, వేముల రాజు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయం భూముల ఆక్రమణలు అడ్డుకోండి: జనసేన పార్టీ

( ఆగస్టు - 19- హంస కలంవార్త )



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి దేవాదాయ భూములలో దేవుడి పేరుతో, గుడి కడతామనే సాకుతో యదేచ్ఛగా కాలి స్థలాన్ని కబ్జాలు చేస్తూన్నారు. ఈ పరిస్థితిని ఆపకపోతే రాబోయే రోజుల్లో ఖాళీ స్థలం అసలు కనపడ కుండా పోతుంది. ఈ మధ్యకాలంలోనే కొత్తగా రెండు మూడు కబ్జాలు కావడమే కాకుండా మరో గుడి పేరుతో మొన్న ఆదివారం నాడు భూమి పూజ చేసి కొండమీద అయ్యప్ప స్వామి గుడి పక్కన ఆక్రమణ చేసేందుకు ప్రణాళిక జరిగింది. పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న వాటర్ ట్యాంక్ వెనకాల కూడా కొంత స్థలాన్ని కబ్జా చేసి నాలుగు రోజుల్లో గది నిర్మించారు. అధికారులు తొలగించినా మళ్ళీ అదే తంతు కొనసాగుతుంది. వీటి మీద తగిన విదంగా చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ స్థానిక నియోజకవర్గ ఇంచార్జ్ నందగిరి సతీష్ మండల తహసీల్దార్ బైరెడ్డి రాజేష్ కి ఫిర్యాదు చేసారు. ఈ నెల 14వ తేదీ శుక్రవారం నాడు ఇదే తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్ కి ఫిర్యాదు చేసినా, ఆదివారం జగద్గిరిగుట్ట కొండమీద గుడి పేరుతో జరిగిన అక్రమ భూమి కబ్జా తతంగాన్ని అడ్డుకోలేకపోయారని తహసీల్దార్ ద్రుష్టికి తీసుకెళ్లడం జరిగింది. తహసీల్దార్ సానుకూలంగా స్పందించి, కబ్జాదారుల మీద తగు విదంగా చర్యలు తీసుకోవాలని వెంటనే ఏఈ ఖలీల్ ని ఆదేశించడం జరిగింది.

## ఖైతలాపూర్ డివిజన్ హబీబ్ నగర్‌లో వైభవంగా ఇందిరమ్మ చీరల పంపిణీ



( ఆగస్టు - 19- హంస కలంవార్త )



ప్రజా ప్రభుత్వం మహిళల సంక్షేమానికి కట్టుబడి ఉంది -- కలికోట శంకర్: కూకట్‌పల్లి నియోజకవర్గం, ఖైతలపూర్ డివిజన్ హబీబ్ నగర్‌లో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వీణ మోయిజ్, ఖైతలపూర్ డివిజన్ ప్రెసిడెంట్ కలికోట శంకర్ హాజరై మహిళలకు చీరలను అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రెసిడెంట్ కలికోట శంకర్ మాట్లాడుతూ... రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రజా ప్రభుత్వం మహిళల సంక్షేమం మరియు సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ప్రగతి పథంలో మహిళలను ముందుంచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటేనే పేదల సంక్షేమం, మహిళల గౌరవమని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అక్బర్, ఆరిఫ్, సుల్తాన్, శ్రవణ్, షాకీర్, అహల్లుద్దీన్, జోగ్గా, జహీర్, జావేద్, తబ్రేజ్, అజీజ్, వినోద్, జైనుద్దీన్, రవి, అజయ్, మహిళా నాయకురాలు జోజ్జమ్మ, ఞా సభ్యులు ఈశ్వరి, విజయలక్ష్మి మరియు ఇతర కార్యకర్తలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## మహిళలు, బాలికలకు సురక్షిత వాతావరణం కల్పించడం అందరి బాధ్యత

**-జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు.**

(ఆగస్టు -19- హంసకలం వార్త )



మహిళలు, బాలికలకు సురక్షిత వాతావరణం కల్పించడం అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు.
బుదవారం జిల్లా సమీకృత కార్యాలయశీలో జిల్లా నిర్భయ ఫండ్ కమిటి సమావేశం జిల్లా కలెక్టర్ అద్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిర్భయ ఫండ్ ద్వారా పైలట్ ప్రాజెక్ట్ గా “మహిళలు, బాలికల కోసం సమ్మిళిత నగరాలు” - ములుగు జిల్లాలో మహిళలు మరియు బాలికలు సురక్షితంగా, మరింత అనుకూలంగా జీవించడానికి, పని చేయడానికి, చదువుకోవడానికి, ప్రయాణించడానికి, రోజువారి కార్యక్రమాలు స్వేచ్ఛగా పాల్గొనడానికి వీలు కల్పించే మహిళా-స్నేహపూర్వక పట్టణ ప్రదేశాలను సృష్టించడం ఈ ప్రాజెక్ట్ లక్ష్యం అని అన్నారు. మహిళలు, బాలికలు భద్రత, రవాణా, ప్రజా ప్రదేశాలు, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, విద్య, ఉపాధి, నిర్ణయాధికారం వంటి అంశాలకు సంబంధించి తరచుగా ఎదుర్కొనే సవాళ్లను ఈ ప్రాజెక్ట్ గుర్తిస్తుందని తెలిపారు. ములుగు జిల్లాలో మహిళలు బాలికలకు సురక్షితమైన టువంటి నగరాలుగా తీర్చిదిద్దడం కొరకు సమన్నత సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని, మహిళల రక్షణకు ప్రాధాన్యత నిచ్చినటువంటి అంశాలను దాంట్లో రూపొందించాలని తెలపడం జరిగింది. ఈ పైలట్ చొరవ ద్వారా, స్థానిక సంఘాలు, ప్రభుత్వ సంస్థలు, పౌర సంఘాలు మరియు ఇతర వాటాదారులు కలిసి పని చేసి, మహిళలు మరియు బాలికలు ఎదుర్కొంటున్న అడ్డంకులను గుర్తించి, ఆచరణాత్మకంగా, స్థానికంగా సంబంధిత పరిష్కారాలను అభివృద్ధి చేస్తారని అన్నారు. ఈ ప్రాజెక్ట్ ప్రధానంగా ప్రజా మౌలిక సదుపాయాలు, భద్రతా యంత్రాంగాలు, అందుబాటు, అవగాహన, పట్టణ ప్రణాళిక మరియు పాలనలో మహిళల భాగస్వామ్యాన్ని మెరుగుపరచడం మొదలైన అంశాలు మహిళల నైపుణ్యాన్ని పెంచుతాయని అన్నారు. ఈ సందర్భంగా కమిటీ జిల్లాలోని మహిళలు బాలికల సురక్షిత అవసరాలను గుర్తించి వాటిపైన ప్రాణాలికలు ప్రతిపాదనలను తయారు చేయడం జరిగింది. ఇట్టి ప్రణాళికలు ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుందని ప్రభుత్వ అనుమతితో తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని కమిటి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమలో జిల్లా సంక్షేమ అధికారి- ఈపీ. ప్రేమలత, కిషోర్ కుమార్ డిఎస్పి, తాకూర్ ఈశ్వర్ సింగ్- జిల్లా రవాణా అధికారి, సంపత్- మున్సిపల్ కమిషనర్ ములుగు, సూర్య కిరణ్- టూరిజం అసిస్టెంట్ మేనేజర్, రమాదేవి- డిస్టిక్ మిషన్ కోఆర్డినేటర్, లావణ్య- సెంటర్ అడ్మిన్ సఖి కేంద్రం, జె ఓంకార్- జిల్లా బాలల పరిరక్షణ అధికారి తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప సొసైటీలో సైబర్ అవగాహన కార్యక్రమం

( ఆగస్టు -19- హంసకలం వార్త )





800 మంది పిల్లలు, యువతకు సైబర్ భద్రతపై అవగాహన కూకట్‌పల్లి : తెలంగాణ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న “సురక్ష కా తిరంగా -- టువర్డ్స్ ఏ సైబర్ ఇండిపెండెంట్ తెలంగాణ” నెలరోజుల సైబర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా అయ్యప్ప సొసైటీలో సైబర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 800 మంది పిల్లలు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: డీసీపీ రితిరాజ్ కూకట్‌పల్లి డీసీపీ శ్రీమతి రితిరాజ్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై పిల్లలు, యువతకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను వినియోగించే సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా, జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఓటీపీ మోసాలు, ఫిషింగ్ లింకులు, నకిలీ పెట్టుబడి పథకాలు, ఫేక్ ఉద్యోగ ఆఫర్లు, వ్యక్తుల పేరుతో జరిగే మోసాలు, ఇతర ఆన్‌లైన్ స్కామ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీసీపీ హెచ్చరించారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించకూడదని తెలిపారు. అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయడం, ధృవీకరించని సందేశాలకు స్పందించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ఏదైనా అనుమానాస్పద ఆన్‌లైన్ లావాదేవీ లేదా మోసం జరిగినప్పుడు వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు. యువత సైబర్ సేఫ్టీ అంబాసిడర్లుగా మారాలి యువత సైబర్ సేఫ్టీ అంబాసిడర్లుగా మారి తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, చుట్టుపక్కల ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని డీసీపీ రితిరాజ్ పిలుపునిచ్చారు. సైబర్ భద్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన పెంపొందించడం ద్వారా ఆన్‌లైన్ మోసాలను గణనీయంగా అరికట్టవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుమారు 800 మంది పిల్లలు, యువత చురుకుగా పాల్గొని సైబర్ భద్రతకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన పొందారు. కార్యక్రమంలో మాదాపూర్ ఏసీపీ శ్రీధర్, మాదాపూర్ ఎస్‌హెచ్‌ఓ కె.వి. సుబ్బారావు, ఎస్ఐలు నరేష్, గిరీష్‌తో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల్లో నిరంతరం సైబర్ అవగాహన పెంపొందించడం, కమ్యూనిటీ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం ద్వారా సైబర్ అవగాహన కలిగిన, సైబర్ సురక్షిత సమాజాన్ని నిర్మించేందుకు సైబరాబాద్ పోలీసులు కట్టుబడి ఉన్నారని అధికారులు తెలిపారు.

# 95.41 గ్రాముల ఎండిఎంఏ , 50 గ్రాముల ఓ జి కుష్ స్వాధీనం





(ఆగస్టు -19- హంసకలం వార్త )

ముగ్గురు డ్రగ్ పెడ్లర్ల అరెస్ట్.. రూ.16.40 లక్షల విలువైన మత్తు పదార్థాలు సీజ్ గచ్చిబౌలి పోలీసులు, ఎస్ఓటీ సైబరాబాద్ సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ముగ్గురు డ్రగ్ పెడ్లర్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి 95.41 గ్రాముల ఎండిఎంఏ , 50 గ్రాముల ఓ జి కుష్ స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాల విలువ సుమారు రూ.16.40 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ కేసులో 16 మంది డ్రగ్ వినియోగ దారులను కూడా అదుపులోకి తీసుకున్నారు. కేరళ, బెంగళూరులో నిందితుల అరెస్ట్ కేసు వివరాలను శేరిలింగంపల్లి డీసీపీ సీహెచ్. శ్రీనివాస్, ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్ మీడియాకు వెల్లడించారు. ఆగస్టు 11న వట్టినాగులపల్లి కింగ్డమ్ పబ్ రోడ్ వద్ద గచ్చిబౌలి పోలీసులు, ఎస్ఓటీ బృందాలు నిర్వహించిన తనిఖీల్లో డ్రగ్ పెడ్లర్ కొరిపెల్ల యశ్వంత్ సాయి షణ్ముఖ్‌ను 16 మంది వినియోగ దారులతో కలిసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. విచారణలో యశ్వంత్‌కు కేరళకు చెందిన మహ్మద్ రజల్ అబ్దుల్ గఫూర్, బెంగళూరుకు చెందిన నవీనా కేడీ ఎండిఎంఏ సరఫరా చేస్తున్నట్లు వెల్లడైందన్నారు. దీంతో ప్రత్యేక పోలీసు బృందాలను కేరళ, బెంగళూరుకు పంపి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఆగస్టు 18న కేరళలోని త్రిస్సూర్‌లో మహ్మద్ రజల్ అబ్దుల్ గఫూర్‌ను అరెస్ట్ చేశారు. విచారణలో యశ్వంత్‌కు 44.41 గ్రాముల ఎండిఎంఏ సరఫరా చేసినట్లు, ఆ డ్రగ్‌ను ‘సామ్’ అనే నైజీరియన్ వ్యక్తి నుంచి పొందినట్లు అతను వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. అదే రోజు బెంగళూరులోని బేగూర్‌లో నవీనా కేడీని అరెస్ట్ చేసి, ఆమె నివాసంలో తనిఖీలు నిర్వహించగా 51 గ్రాముల ఎండిఎంఏ, 50 గ్రాముల ఓజి కుష్ తెలిపారు. ఈ డ్రగ్‌ను కేరళకు చెందిన తన స్నేహితుడు అనేశ్వర్ నుంచి పొందినట్లు నవీనా విచారణలో వెల్లడించిందన్నారు. రూ.16.40 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనంమొత్తంగా 95.41 గ్రాముల ఎండిఎంఏ 50 గ్రాముల ఓ జి కుష్ తో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని డీసీపీలు తెలిపారు. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ విలువ సుమారు రూ.16.40 లక్షలు ఉంటుందని వెల్లడించారు. డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై సైబరాబాద్ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారని డీసీపీలు తెలిపారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థుల కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. డ్రగ్స్ లేదా గంజాయి అక్రమ రవాణాకు సంబంధి ంచిన సమాచారం తెలిసిన వారు వెంటనే డయల్-100 లేదా సైబరాబాద్ పోలీసుల వాట్సాప్ నంబర్ 8712663061కు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.



# ఖైతలాపూర్‌లో ఘనంగా ఇందిరమ్మ చీరల పంపిణీ

(ఆగస్టు -19- హంస కలంవార్త )





మహిళల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది: కలికోట శంకర్ కూకట్‌పల్లి నియోజకవర్గం ఖైతలాపూర్ డివిజన్ పరిధిలోని హబీబ్‌నగర్‌లో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండీ మోయిజ్, ఖైతలాపూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కలికోట శంకర్ పాల్గొని మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలికోట శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రజా ప్రభుత్వం మహిళల సంక్షేమం, సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షే మంతో పాటు మహిళల గౌరవానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటేనే పేదల సంక్షేమం, మహిళల గౌరవం అని ఆయన పునరుద్ఘాటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్బర్, ఆరిఫ్, సుల్తాన్, శ్రవణ్, షాకీర్, అహల్లుద్దీన్, జోగ్గా, జహీర్, జావేద్, తబ్రేజ్, అజీజ్, వినోద్, జైనుద్దీన్, రవి, అజయ్, మహిళా నాయకురాలు జోజ్జమ్మ, ఆర్‌పీ సభ్యులు ఈశ్వరి, విజయలక్ష్మితో పాటు పార్టీ కార్యకర్తలు, స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వీడిన ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య కేసు మిస్టరీ







-కీలకంగా మారిన బాబు అనే పదం
-స్కూల్లో టెన్త్ స్టూడెంట్స్ ఘాతుకం
-హత్య నుంచి తప్పించుకునేందుకు సోషల్ మీడియాలో సెర్చ్
-5 ప్రత్యేక బృందాలు.. 40 మంది పోలీసుల
-80 మందికి పైగా అనుమానితుల విచారణ
-30 కి.మీ. పరిధిలో 70 సీసీ కెమెరాల ఫుటేజ్ ల పరిశీలన పరిశీలన
-ఇద్దరు నిందితుల అరెస్టు, రిమాండ్
-రూ. 1.54 లక్షల నగదు, మూడు సెల్ ఫోన్లు, కత్తి, గ్లౌజ్, మాస్క్ ల స్వాధీనం
-ఫోరెన్సిక్, ఫింగర్ ప్రింట్స్ డాగ్ స్క్వాడ్, సాంకేతిక ఆధారాలే కీలకం
-కేసు వివరాలను మీడియా వెల్లడించిన ఎస్పీ శరత్ చంద్ర పవార్

(ఆగస్టు -19- హంసకలం వార్త )

నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి లో ఈ నెల 11న జరిగిన నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ కల్లు రూపారెడ్డి(45) హత్య కేసు మిస్టరీ వీడింది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ టెన్త్ విద్యార్థులే నిందితులని పోలీసుల విచారణలో తేలింది. స్కూల్ హాస్టల్ లో ఉంటూ డబ్బుతో పట్టుబడిన ఇద్దరు పదో తరగతి విద్యార్థులను ప్రిన్సిపాల్ వారి తల్లిదండ్రుల సమక్షంలో మందలించడంతో కక్ష పెంచుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగు చూసింది. దీంతో పాటు జల్సాలకు, చెడు వ్యసనాలకు బానిసగా మారిన విద్యార్థులు ప్రిన్సిపాల్ వద్ద పెద్ద మొత్తంలో నగదు ఉంటుందని భావించి హత్యకు పథకం రచించినట్లు పోలీసులు తమ విచారణలో గుర్తించారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ రూపా రెడ్డి హత్య కేసు వివరాలను వెల్లడించారు.

**-హత్యకు ముందు రెక్కీ**

ఇద్దరు విద్యార్థులు ఒకే పాఠశాలలో పదో తరగతి చదువుతూ హాస్టల్లో ఒకే గదిలో ఉంటున్నారు. జల్సాలు, చెడు వ్యసనాలకు అలవాటు పడటంతో పాటు తల్లిదండ్రులకు తెలియకుండా సెల్ ఫోన్లు వినియోగిస్తూ సోషల్ మీడియా, యూట్యూబ్ లో సులభంగా డబ్బు సంపాదించే మార్గాలను సెర్చ్ చేసినట్లు పోలీసులు చెప్పారు. ఇటీవల హాస్టల్లో డబ్బుతో పట్టుబడటంతో రూపారెడ్డి తల్లిదండ్రుల సమక్షంలో వారిని మందలించినట్లు పోలీసులు చెప్పారు. సులభమైన రీతిలో డబ్బు సంపాదన... అదే సమయంలో ప్రిన్సిపాల్ పై కోపంతో పాటు ఆమె వద్ద పెద్ద ఎత్తున డబ్బు ఉంటుందని నిందితులు హత్యకు వారం రోజుల ముందు నుంచే రూపారెడ్డి కదలికలను గమనించి హత్య చేసినట్లు పోలీసులు చెప్పారు.

**-కత్తి, గ్లౌజ్ లు కొనుగోలు**

రూపారెడ్డి స్కూల్ నుంచి ఇంటికి చేరుకునే సమయానికి ముందే సుమారు గంటలకు పాఠశాల నుంచి ఇంటికి వెళ్లిన విద్యార్థుల్లో ఒకరు బ్యాగులో ఎరుపు రంగు హుడీ, ప్యాంట్ తీసుకుని వచ్చినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఇద్దరూ కొండమల్లేపల్లిలో కత్తి, గ్లౌజులు కొనుగోలు చేశారు. రూపారెడ్డి ఇంటి సమీపంలోని వాటర్ ట్యాంక్ వద్దకు చేరుకున్నారు. ఒకరు బయట ఉండి ఎవరైనా వస్తున్నారా అని గమనించగా మరొకరు ఇంటి వెనుక భాగం నుంచి లోపలికి ప్రవేశించారు. అప్పటికే తెరిచి ఉన్న వంటగది మార్గం ద్వారా ఇంట్లోకి వెళ్లి రూపారెడ్డిపై కత్తితో పాశవికంగా దాడి చేసి హత్య చేసినట్లు చెప్పారు.

**-రూ. 2.50 లక్షలతో పరారీ**

నిందితులు హత్య అనంతరం ఇంట్లో ఉన్న సుమారు రూ. 2.50 లక్షల నగదును తీసుకుని ఇంటి వెనుక గోడ దూకి నిర్మానుష్య ప్రాంతం నుంచి పరారైట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. కత్తి, గ్లౌజులు, మాస్క్, సెల్ ఫోన్, చెట్ల పొదల్లో పడేసి... ఆ తర్వాత బట్టలు మార్చుకుని ఎరుపు రంగు హుడీని డ్రైనేజీలో పడేసి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు చెప్పారు.

**-'బాబు' ఆ పిలుపే కేసులో కీలక క్లూ**

రూపారెడ్డి హత్య కేసు దర్యాప్తులో కీలక మలుపు 'బాబు' అన్న పిలుపు కేసులో కీలక క్లూ గా మారింది. హత్యకు ముందు రూపారెడ్డి తన చిన్నమ్మతో ఫోన్ లో సంభాషిస్తున్న వేళ చివరగా 'బాబు' అని పలికారు. అనంతరం ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో... ఆమె ఎవరిని ఉద్దేశించి 'బాబు' అన్నది అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే రూపారెడ్డి పాఠశాలలో విద్యార్థులను సాధారణంగా 'బాబు' అని పిలిచేవారని గుర్తించిన పోలీసులు దర్యాప్తును విద్యార్థుల వైపు మళ్లించారు. ప్రిన్సిపాల్ హత్యతో పాఠశాలకు వరుసగా ఆరు రోజుల పాటు సెలవులు ప్రకటించడంతో విచారణ ఆలస్యమైంది. కాగా స్కూల్ మళ్లీ ప్రారంభమైన అనంతరం విద్యార్థులను ఒక్కొక్కరిని విచారించారు. స్కూల్ ప్రారంభమయ్యాక విద్యార్థులు ఎవరు గైర్హాజరయ్యారు అన్న విషయంలోనూ పోలీసులు విచారణ చేసి నిందితులను గుర్తించారు.

**-హత్య జరిగిన స్థలం నుంచి 30 కిలోమీటర్ల వరకు సీసీ ఫుటేజ్ లను పరిశీలించిన పోలీసులు**

రూపారెడ్డి హత్య కేసును ఛేదించేందుకు పోలీసులు శాస్త్రీయ దర్యాప్తు చేశారు. ఫోరెన్సిక్ ఆధారాలు, ఫింగర్ ప్రింట్స్, డాగ్ స్క్వాడ్, సీసీ కెమెరాల ఫుటేజీ, సాంకేతిక ఆధారాల కోసం వెతికారు. హత్య జరిగిన స్థలం నుంచి సుమారు 30 కిలోమీటర్ల పరిధిలోని ప్రాంతాలను, సుమారు 70 సీసీ కెమెరాల ఫుటేజిలను రేయింబవళ్లు క్షుణ్ణంగా పరిశీలించి కేసును చేదించారు.

**-కేసు విచారణలో ఐదు ప్రత్యేక బృందాలు... 40 మంది పోలీసులు**

అనేక రకాల అనుమానాలకు అవకాశం ఉన్న ప్రిన్సిపాల్ రూపా రెడ్డి హత్య కేసులో మొదట ఎలాంటి క్లూ దొరకలేదు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైన పోలీసులకు సవాల్ విసిరిన ఈ కేసులో ఐదు ప్రత్యేక బృందాలు, 40 మంది పోలీసులు రంగంలోకి దిగారు. కాగా రెండు రోజులుగా పాఠశాలకు హాజరుకాని కొందరు విద్యార్థులపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. వారిలో జల్సాలకు అలవాటుపడిన కొందరిని అనుమానించి నిఘా పెట్టారు. సీసీ కెమెరా ఫుటేజిల్లో లభించిన ఆధారాలు అనుమానిత విద్యార్థులపై ఫోకస్ చేశారు.

**-పెండ్లిపాకల క్రాస్ రోడ్డు వద్ద పట్టుబడిన నిందితులు**

పెండ్లిపాకల క్రాస్ రోడ్డు నుంచి మల్లేపల్లి వైపు వెళు_న్న ఇద్దరు పదో తరగతి విద్యార్థులను దొనియాల క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించి తనిఖీ చేశారు. వారి వద్ద రూ. 1.54 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. అందులో మూడు రూ.500 నోట్లపై రక్తపు మరకలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నగదు ఎక్కడి నుంచి వచ్చిందని విద్యార్థులను ప్రశ్నించడంతో రూపారెడ్డిని హత్య చేసి నగదు దొంగిలించినట్లు విద్యార్థులు చెప్పారని పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి రూ. 1.54 లక్షల నగదు, మృతురాలి సెల్ ఫోన్, మరో రెండు సెల్ ఫోన్లు, హత్యకు ఉపయోగించిన కత్తి, గ్లౌజ్ లు, మాస్కులు స్వాధీనం చేసుకొని నిందితులిద్దరిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు పోలీసులు చెప్పారు.



**-నిందితులిద్దరూ మైనర్లే**

నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్లో చదువుతున్న నిందితులు మైనర్లేనని ఎస్పీ తెలిపారు. కేసును చేదించిన అధికారులను అభినందించిన ఎస్పీ కేసును ఛేదించడంలో దేవరకొండ డీఎస్పీ ఎం.వి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మల్లేపల్లి సీఐ ఏ. నవీన్ కుమార్, సీసీఎస్ ఇన్స్పెక్టర్ ఎం. జితేందర్ రెడ్డి, ఎస్ఐలు, సీసీఎస్ సిబ్బంది కీలకంగా పనిచేశారు. ప్రత్యేక బృందాల కృషిని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించి రివార్డులు ప్రకటించారు.

# సహకార సంఘం చైర్ పర్సన్ గా నాగభూషణం

(ఆగస్టు -19- హంసకలం వార్త )

మండలంలోని జెండా వెంకటాపూర్ రైతు సహకార సంఘం నూతన చైర్ పర్సన్ గా పట్టణానికి చెందిన చెల్ల నాగభూషణం బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులుగా కేతిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, నస్పూరి సత్యం, సంఘం శ్రీనివాస్,గంగినేని హరీష్, భాగ్యమ్మ, సువర్ణ, సుధాకర్, జగ్గన్న, రాజయ్య, లింగయ్య, రత్తయ్య,జంగు ప్రమాణ స్వీకారం చేశారు. కాగా, గుల్లకోట చైర్ పర్సన్ గా పెయ్యాల దేవేందర్ రెడ్డి తో పాటు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ సమక్షంలో పాలక వర్గాలకు నియామక పత్రాలు అందజేశారు. పలువురు నాయకులు, కార్యకర్తలు నూతన పాలక వర్గాలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షులు, వెంకట్రావ్ పేట్ సర్పంచ్ నలిమేల రాజు, నాయకులు పూర్ణ చందర్ రావు,దొంత నర్సయ్య,పింగళి రమేష్,మోహన్, సుమన్, సుధాకర్, అనుమాల వేణు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

-రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి.




(ఆగస్టు -19- హంసకలం వార్త )

ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్కు జిల్లా ఐడీఓసీ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్టతో కలిసి జిల్లా కలెక్టర్ అంకిత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎస్ఐఆర్లో భాగంగా ఓటర్ల మ్యాపింగ్, మ్యాపింగ్ కాని ఓటర్లు, వివరాల్లోని వ్యత్యాసాలను గుర్తించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియ పూర్తైన అనంతరం మ్యాపింగ్ కాని ఓటర్లు, వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేయాలని తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత తేదీ, సమయంలో హాజరై పౌరసత్వాన్ని నిర్ధారించే సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 రకాల ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించాలని, అలాగే అక్టోబర్ 15 వరకు నోటీసులు జారీ చేసి నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాల్లో చేపడుతున్న చర్యలపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి రాష్ట్ర స్థాయికి పంపాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సులభంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై విస్తృతంగా అవగాహన కల్పించి, అవసరమైన ధ్రువపత్రాలతో నిర్ణీత సమయంలో హాజరయ్యేలా చూడాలని సూచించారు. నోటీసుల జారీ, క్లెయిమ్‌లు--అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం తదితర ప్రతి దశను అధికారులు సమన్వయంతో పర్యవేక్షిస్తూ, నిర్ణీత కాలపరిమితిలో ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియకు సంబంధించిన స్థితిగతులను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియలో గుర్తించిన వివరాల్లోని వ్యత్యాసాలు (అనిమల్స్), మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను నియోజకవర్గాల వారీగా వివరించారు. పినపాక నియోజకవర్గంలో 39,670 వివరాల్లో వ్యత్యాసాలు (అనిమల్స్), 16,421 నో మ్యాపింగ్, ఇల్లెందు నియోజకవర్గంలో 37,660 వివరాల్లో వ్యత్యాసాలు, 5,656 నో మ్యాపింగ్, కొత్తగూడెం నియోజకవర్గంలో 46,743 వివరాల్లో వ్యత్యాసాలు, 23,428 నో మ్యాపింగ్ ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా అశ్వారావుపేట నియోజకవర్గంలో 28,994 వివరాల్లో వ్యత్యాసాలు, 7,361 నో మ్యాపింగ్, భద్రాచలం నియోజకవర్గంలో 27,162 వివరాల్లో వ్యత్యాసాలు, 7,340 నో మ్యాపింగ్ ఉన్నట్లు వివరించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 1,80,229 వివరాల్లో వ్యత్యాసాలు ( అనిమల్స్), 60,206 నో మ్యాపింగ్ ఉన్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి జిల్లా కలెక్టర్ అంకిత్ వివరించారు. డిజిటైజేషన్ ప్రక్రియలో ఎదురవుతున్న అంశాలను నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తూ, ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు గ్రామాలు, మున్సిపల్ పరిధిలో ధ్రువపత్రాల స్వీకరణకు తేదీ, సమయాలను ముందుగానే ఖరారు చేయాలని అధికారులకు సూచించారు. ఆయా కేంద్రాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి ఓటర్లకు అవసరమైన సహాయం అందించాలని ఆదేశించారు. అధికారులకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవసరమైన శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు.ప్రతి దశలోనూ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, కాలపరిమితులకు అనుగుణంగా ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సమావేశంలో కొత్తగూడెం ఆర్డీవో మధు, ఎన్నికల విభాగం సూపర్డెంట్ రంగ ప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు ఎన్నికల విభాగం సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# బిజినెస్

# మీ స్టార్టప్‌కు నిధులు కావాలా ఈ ప్రభుత్వ పథకాలపై ఓ లుక్కేయండి!

**స్టార్టప్‌లకు ప్రభుత్వం అనేక పథకాల ద్వారా మద్దతు**
**అన్ని పథకాలు నేరుగా నగదు ఇవ్వవు.. గ్రాంట్లు, పెట్టుబడులు, రుణ హామీలు వేర్వేరు**
**నిధి-ప్రయాస్ 2.0 కింద ప్రోటోటైప్‌కు రూ.40 లక్షల వరకు సాయం**
**ఫండ్ ఆఫ్ ఫండ్స్ ద్వారా నేరుగా కాకుండా ఏఐఎఫ్‌ల ద్వారా పెట్టుబడులు**

భారతదేశంలో స్టార్టప్‌లు, చిన్న వ్యాపారాలకు చేయూతనివ్వడానికి కేంద్ర ప్రభుత్వం అనేక రకాల పథకాలను అమలు చేస్తోంది. ఆలోచన దశ నుంచి ప్రోటోటైప్ తయారీ, వెంచర్ క్యాపిటల్, రుణాల సమీకరణ వరకు వివిధ దశల్లో ఈ పథకాలు అండగా నిలుస్తున్నాయి. అయితే, ప్రతి పథకం అందించే సహాయం, దాని స్వరూపం వేర్వేరుగా ఉంటాయి. అన్ని పథకాలు నేరుగా వ్యవస్థాపకుల చేతికి డబ్బును అందించవన్న విషయాన్ని గమనించాలి. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న అనేక గణాంకాలు పాతవి లేదా తప్పు అని అధికారిక సమాచారం స్పష్టం చేస్తోంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కొన్ని ముఖ్యమైన పథకాలలో నిధి-ప్రయాస్, సమృద్ధి, టైడ్ 2.0, స్టార్టప్ ఇండియా ఫండ్ ఆఫ్ ఫండ్స్, క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్ ఫర్ స్టార్టప్స్ (జ+ుూా), క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ట్రస్ట్ ఫర్ మైక్రో అండ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ (జ+ుమీూజు) ఉన్నాయి. ఈ పథకాలపై పూర్తి అవగాహనతో ముందడుగు వేయడం వ్యవస్థాపకులకు ఎంతో అవసరం.

**ప్రోటోటైప్, ప్రారంభ దశ కోసం పథకాలు**

నిధి-ప్రయాస్ 2.0: సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం కింద పనిచేసే ఈ పథకం, వినూత్న ఆలోచనలను ప్రోటోటైప్‌లుగా మార్చడానికి సహాయపడుతుంది. నిధి-ప్రయాస్ 2.0 కింద, టెక్నాలజీ ఆధారిత ఆవిష్కరణలకు ఒక్కో స్టార్టప్‌కు గరిష్ఠంగా రూ. 20 లక్షల వరకు ప్రోటోటైప్ ఫండింగ్ లభిస్తుంది. డీప్‌టెక్ వంటి అధునాతన ప్రోటోటైప్‌ల కోసం 'అడ్వాన్స్ ప్రయాస్ సెంటర్లు' రూ. 40 లక్షల వరకు సాయం అందిస్తాయి. గతంలో ఈ పథకం కింద గరిష్ఠ పరిమితి రూ. 10 లక్షలు మాత్రమే. ఇది మహిళల స్టార్టప్‌లకు రూ. 10 కోట్ల ఈక్విటీ ఫండింగ్ ఇచ్చే పథకం అని జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవం. సమృద్ధి (ూాూవీ=×ణఎ): ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ మంత్రిత్వ శాఖ (వీవఊ) ఆధ్వర్యంలోని ఈ పథకం, ఐటీ ఆధారిత స్టార్టప్‌లు వేగంగా ఎదిగేందుకు తోడ్పడుతుంది. ఎంపికైన స్టార్టప్‌లకు యాక్సిలరేటర్ల ద్వారా రూ. 40 లక్షల వరకు మ్యాచింగ్ ఫండింగ్ సపోర్ట్ అందిస్తుంది. కస్టమర్లు, ఇన్వెస్టర్లతో కనెక్ట్ అవ్వడానికి కూడా ఈ పథకం సహాయపడుతుంది.

టైడ్ (ు×ణజు) 2.0: ఇది కూడా వీవఊ పరిధిలోనిదే. టెక్నాలజీ స్టార్టప్‌లకు ప్రారంభ దశలో నిధులు, ఇంక్యుబేషన్, మెంటరింగ్ అందిస్తుంది. ఆలోచనను ప్రాథమికంగా నిరూపించడానికి (ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్) రూ. 4 లక్షల వరకు, ప్రోటోటైప్ అభివృద్ధికి రూ. 7 లక్షల వరకు గ్రాంట్, ఉత్పత్తి అభివృద్ధి, మార్కెటింగ్ కోసం రూ. 40 లక్షల వరకు పెట్టుబడి రూపంలో సహాయం లభిస్తుంది.

**పెట్టుబడులు, వెంచర్ క్యాపిటల్ కోసం**



స్టార్టప్ ఇండియా ఫండ్ ఆఫ్ ఫండ్స్: ప్రభుత్వం నేరుగా స్టార్టప్‌లలో పెట్టుబడులు పెట్టకుండా, సెబీ గుర్తింపు పొందిన వెంచర్ ఫండ్స్ (ూా×ఖీం) ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తోంది. రూ. 10,000 కోట్ల కార్పస్‌తో ప్రారంభమైన ఈ పథకం కింద, 2025 మార్చి 31 నాటికి 153 ఏఐఎఫ్‌లకు రూ. 11,808 కోట్లు కేటాయించినట్లు సిడ్బీ నివేదించింది. ఫండ్ ఆఫ్ ఫండ్స్ 2.0: 2026 ఏప్రిల్‌లో రూ. 10,000 కోట్ల కార్పస్‌తో ఈ పథకాన్ని ప్రారంభించారు. ఇది కూడా ఏఐఎఫ్‌ల ద్వారానే స్టార్టప్‌లలో పెట్టుబడులు పెడుతుంది. ముఖ్యంగా డీప్‌టెక్, వినూత్న తయారీ రంగం, ప్రారంభ దశలోని స్టార్టప్‌లపై ఇది దృష్టి పెడుతుంది. స్టార్టప్‌లు నేరుగా ప్రభుత్వానికి కాకుండా, ఈ పథకం కింద ఎంపికైన ఏఐఎఫ్‌లను పెట్టుబడుల కోసం సంప్రదించాలి.

**రుణాల కోసం ప్రభుత్వ హామీ పథకాలు**

క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్ ఫర్ స్టార్టప్స్ (జ+ుూా): ఇది స్టార్టప్‌లకు నేరుగా రుణాలు ఇవ్వదు. డీపీఐఐటీ గుర్తింపు పొందిన స్టార్టప్‌లు బ్యాంకుల నుంచి రుణం తీసుకున్నప్పుడు, ఆ రుణానికి ఈ పథకం ద్వారా ప్రభుత్వం హామీ ఇస్తుంది. దీనివల్ల బ్యాంకులు ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణాలు ఇవ్వడానికి ముందుకు వస్తాయి. సవరించిన నిబంధనల ప్రకారం, ఒక్కో స్టార్టప్‌కు రూ.20 కోట్ల వరకు తీసుకునే రుణాలకు ఈ హామీ వర్తిస్తుంది. రూ.10 కోట్ల వరకు రుణంలో 85 శాతం, ఆపైన రుణంలో 75 శాతం డిఫాల్ట్ మొత్తానికి ప్రభుత్వం హామీ ఇస్తుంది. జ+ుమీూజు: సూక్ష్మ, చిన్న పరిశ్రమల కోసం ఉద్దేశించిన ఈ పథకం కూడా రుణ హామీని మాత్రమే అందిస్తుంది. సభ్యులుగా ఉన్న బ్యాంకులకు, వారు ఇచ్చే రుణాలకు ఇది హామీ ఇస్తుంది. ప్రస్తుతం ఒక్కో సంస్థకు రూ.10 కోట్ల వరకు తీసుకునే రుణాలకు ఈ గ్యారెంటీ వర్తిస్తుంది. 2025లో ఈ పరిమితిని రూ.5 కోట్ల నుంచి రూ. 10 కోట్లకు పెంచారు. మొత్తం మీద, ప్రభుత్వ మద్దతు అనేది గ్రాంట్, పెట్టుబడి, మ్యాచింగ్ ఫండింగ్, రుణ హామీ వంటి పలు రూపాల్లో ఉంటుందని వ్యవస్థాపకులు గ్రహించాలి. ఒక పథకం కింద ప్రకటించిన గరిష్ఠ మొత్తం ప్రతి ఒక్కరికీ లభించే నగదు కాదని, అర్హత నిబంధనలు, ఎంపిక ప్రక్రియ, వ్యాపార దశ, సంబంధిత ఇంక్యుబేటర్ లేదా బ్యాంకు వంటి అనేక అంశాలపై అందే సహాయం ఆధారపడి ఉంటుందని గుర్తుంచుకోవాలి.

# శ్రీలంక గడ్డపై మానవ్ సుతార్ చరిత్ర.. దిగ్గజాల రికార్డులు బ్రేక్

# క్రీడలు

**శ్రీలంక గడ్డపై అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసిన సుతార్**
**దిగ్గజ బౌలర్లు హర్భజన్, అశ్విన్‌లను అధిగమించిన యువ స్పిన్నర్**
**గాలే టెస్టులో శ్రీలంకపై 165 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం**

శ్రీలంక గడ్డపై భారత యువ స్పిన్ ఆల్‌రౌండర్ మానవ్ సుతార్ చారిత్రక ప్రదర్శనతో అదరగొట్టాడు. గాలే వేదికగా జరిగిన తొలి టెస్టులో అద్భుత బౌలింగ్‌తో ఏకంగా 10 వికెట్లు పడగొట్టి, టీమిండియా దిగ్గజాలు హర్భజన్ సింగ్, రవిచంద్రన్ అశ్విన్‌ల రికార్డులను అధిగమించాడు. ఈ మ్యాచ్‌లో 10/131 గణాంకాలతో శ్రీలంకలో ఒక టెస్టు మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన భారత బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. లంకలో 10 వికెట్ల ఘనత సాధించిన మూడో భారత బౌలర్‌గా నిలిచాడు. సుతార్ విజృంభణకు దేవదత్ పడిక్కల్ సెంచరీ తోడవడంతో భారత్ 165 పరుగుల భారీ తేడాతో గెలుపొంది, రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది.

**మ్యాచ్ సాగిందిలా..**

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న భారత్, తొలి ఇన్నింగ్స్‌లో 462 పరుగుల భారీ స్కోరు సాధించింది. యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ (230 బంతుల్లో 167; 15 ఫోర్లు, 1 సిక్స్) అద్భుత సెంచరీతో కదం తొక్కగా, కేఎల్ రాహుల్ (82), వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ (51) కీలక అర్ధ సెంచరీలతో రాణించారు. శ్రీలంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక, భారత స్పిన్నర్ల ధాటికి 90 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో నిరోషన్ డిక్వెల్లా (80), సోనల్ దినుష (100) ఆదుకున్నారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 146 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే, మానవ్ సుతార్ (4/76) విజృంభించడంతో శ్రీలంక 284 పరుగులకే ఆలౌటైంది. దీంతో భారత్‌కు 178 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

**సుతార్ స్పిన్ మ్యాజిక్**

రెండో ఇన్నింగ్స్‌లో భారత బ్యాటర్లు తడబడ్డారు. రిషభ్ పంత్ (66 బంతుల్లో 69), పడిక్కల్ (44), రాహుల్ (35) మినహా ఎవరూ రాణించకపోవడంతో భారత్ 193 పరుగులకు ఆలౌటైంది. శ్రీలంక బౌలర్లలో అసిథ ఫెర్నాండో 4, ప్రభాత్ జయసూర్య 3 వికెట్లు తీశారు. దీంతో శ్రీలంక ముందు 372 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది. భారీ లక్ష్య ఛేదనలో శ్రీలంక మరోసారి తడబడింది. 47 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. అయితే, ధనంజయ డిసిల్వా (59), సోనల్ దినుష (84) మరోసారి పోరాడి 91 పరుగుల భాగస్వామ్యంతో ఆశలు రేపారు. కానీ, మానవ్ సుతార్ తన స్పిన్‌తో మాయ చేశాడు. కేవలం 10 బంతుల వ్యవధిలో లోయర్ ఆర్డర్‌ను కుప్పకూల్చి శ్రీలంక పతనాన్ని శాసించాడు. రెండో




ఇన్నింగ్స్‌లో 6/55 గణాంకాలతో అదరగొట్టడంతో శ్రీలంక 206 పరుగులకే ఆలౌటైంది. ప్రసిధ్ కృష్ణ 2 వికెట్లు తీయగా, సిరాజ్, జడేజా చెరో వికెట్ పడగొట్టారు. ఈ అద్భుత ప్రదర్శనతో మానవ్ సుతార్ మ్యాచ్ హీరోగా నిలిచాడు.

# గాలే టెస్టులో భారత్ ఘన విజయం.. సుతార్ స్పిన్ మాయకు లంక చిత్తు!

**గాలే టెస్టులో శ్రీలంకపై 165 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం**
**రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు పడగొట్టి సత్తా చాటిన యువ స్పిన్నర్ మానవ్ సుతార్**
**మొదటి ఇన్నింగ్స్‌లో దేవదత్ పడిక్కల్ సెంచరీతో భారత్‌కు భారీ ఆధిక్యం**
**ఈ గెలుపుతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచిన టీమిండియా**
**ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో 12 కీలక పాయింట్లు ఖాతాలో వేసుకున్న భారత్**

శ్రీలంకతో జరిగిన తొలి టెస్టులో భారత జట్టు 165 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. యువ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్ (6/55) అద్భుతమైన బౌలింగ్‌తో చెలరేగడంతో టీమిండియా మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లిన భారత్, ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఖాతాలో 12 కీలక పాయింట్లను జమ చేసుకుంది. భారత జట్టుకు ఇది 600వ టెస్టు మ్యాచ్ కావడం, గాలే స్టేడియానికి 50వ టెస్టు కావడం ఈ విజయానికి మరింత ప్రత్యేకతను చేకూర్చింది. నేడు ఐదో రోజు ఆటలో భాగంగా రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన శ్రీలంక 77.4 ఓవర్లలో 206 పరుగులకు ఆలౌట్ అయింది. లంచ్ విరామం తర్వాత శ్రీలంక బ్యాటర్లు సోనాల్ దినుష, కేశర నువంత



కొద్దిసేపు భారత బౌలర్లను నిలువరించారు. ముఖ్యంగా తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో రాణించిన దినుష (84) మరోసారి అద్భుతంగా ఆడి, రెండో సెంచరీ దిశగా సాగుతున్నట్లు కనిపించాడు. ఈ దశలో మ్యాచ్ డ్రాగా ముగుస్తుందేమోన నిపించింది. అయితే, యువ కెరటం మానవ్ సుతార్ తన స్పిన్ మాయాజాలంతో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. 76వ ఓవర్లో బౌలింగ్‌కు వచ్చిన సుతార్, ఒకే ఓవర్లో మూడు వికెట్లు పడగొట్టి శ్రీలంక పతనాన్ని శాసించాడు. ఆ ఓవర్లో దినుషను లెగ్ గల్లీలో ధ్రువ్ జురెల్ క్యాచ్ ద్వారా ఔట్ చేసి కీలక భాగస్వామ్యాన్ని విడదీశాడు. ఆ తర్వాతి బంతికే ప్రభాత్ జయసూర్యను క్లీన్ బౌల్డ్ చేశాడు. హ్యాట్రిక్ బంతిని లహిరు కుమార ఎదుర్కొన్నప్పటికీ, రెండు బంతుల తర్వాత అతనిని కూడా కీపర్ రిషభ్ పంత్ క్యాచ్ ద్వారా పెవిలియన్‌కు పంపాడు. దీంతో తన రెండో టెస్టులోనే రెండోసారి ఐదు వికెట్ల ఘనతను సుతార్ అందుకున్నాడు. ఆ తర్వాత కొద్దిసేపు నువంత (20) పోరాడినా.. 78వ ఓవర్లో అతడిని కూడా బౌల్డ్ చేసిన సుతార్, భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. దీంతో భారత శిబిరంలో సంబరాలు అంబరాన్నంటాయి. ఈ మ్యాచ్‌లో సుతార్ మొత్తం 101 పరుగులిచ్చి 10 వికెట్లు పడగొట్టాడు. భారత్ విజయానికి తొలి ఇన్నింగ్స్‌లో దేవదత్ పడిక్కల్ సాధించిన అద్భుతమైన సెంచరీ (167) బలమైన పునాది వేసింది. అతని ఇన్నింగ్స్ వల్లే భారత్‌కు 178 పరుగుల కీలక ఆధిక్యం లభించింది. ఇక, రెండో ఇన్నింగ్స్‌లో రిషభ్ పంత్ ఆడిన వ్యూహాత్మక ఇన్నింగ్స్ (66) కూడా జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. ఈ స్కోరుతో భారత్ బౌలర్లు టర్నింగ్ పిచ్‌పై లంక బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టి విజయాన్ని ఖాయం చేశారు.

# ‘మిస్టర్ మిడిల్ క్లాస్’ (ఆహా)మూవీ రివ్యూ!



కామెడీ ప్రధానమైన కథలను తెరకెక్కించడంలో దర్శకుడు జి.నాగేశ్వరరెడ్డికి మంచి నైపుణ్యం ఉంది. ‘సీమశాస్త్రి’.. ‘సీమటపాకాయ్’ .. ‘దేనికైనా రెడీ’ సినిమాలు ఆయన మార్క్ ఏమిటనేవి చూపిస్తాయి. అలాంటి ఆయన శ్రీకాంత్ కథానాయకుడిగా రూపొందించిన సినిమానే ‘మిస్టర్ మిడిల్ క్లాస్’. శ్రీకాంత్ సరసన లయ నటించగా, ఇతర కీలకమైన పాత్రలలో రాజేంద్రప్రసాద్ .. వెన్నెల కిశోర్ .. రఘుబాబు .. పృథ్వీ కనిపించనున్నారు. జులై 17వ తేదీన థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, ఆగస్టు 19 నుంచి ‘ఆహా’లో స్ట్రీమింగ్ అవుతోంది. వెంకటరమణ (శ్రీకాంత్) పద్మావతి (లయ) భార్యాభర్తలు. వారికి ఇద్దరు పిల్లలు. వెంకటరమణ తండ్రి ఏడు కొండలు (మురళీధర్ గౌడ్) అతని చెల్లెలు కరుణ – బావ శ్రీను కూడా అదే ఇంట్లో ఉంటారు. మిడిల్ క్లాస్ ఫ్యామిలీకి చెందిన వెంకటరమణకు, ఆర్థికపరమైన ఇబ్బందులు ఎంతమాత్రం లేని కోటీశ్వరుడు కావాలనేది కోరిక. ఆ దురాశ కారణంగానే అతను పెద్ద హోటల్ పెట్టి అప్పులపాలవుతాడు. అదే హోటల్లో ఆ ఫ్యామిలీ అంతా పనివాళ్లుగా చేరే పరిస్థితి వస్తుంది. అలా వచ్చిన డబ్బుతోనే అప్పులు తీరుస్తూ వెళుతుంటారు. ఒకానొక దశలో అతను తాను బలంగా నమ్మే వేంకటేశ్వరస్వామి గుడి దగ్గరే నైట్ వాచ్ మెన్ గా కుదురుతాడు. భార్య ఆయాగా చేరవలసిన పరిస్థితి వస్తుంది. ఆ దేవుడు ఆర్థికపరమైన ఇబ్బందుల నుంచి తనని బయటపడేయక పోవడం వలన, ఆత్మహత్య చేసుకోవాలని వెంకటరమణ నిర్ణయించుకుంటాడు. అప్పుడు ఆ స్వామి (రాజేంద్రప్రసాద్) ప్రత్యక్షమై, తన విలువైన ఆభరణాలను అతనికి ఇస్తాడు. అయితే అవి గిల్ట్ నగలు అనుకుని, పద్మావతి వాటిని చెరువులో పారేస్తుంది. ఈ విషయం తెలుసుకున్న స్వామి, వెంకటరమణకు 13 పేజీలను కలిగిన ఒక ‘బుక్’ ఇస్తాడు. ఆ బుక్ లో అతను ఏది రాస్తే అది జరుగుతుందని చెబుతాడు. కొన్ని నియమాలు చెప్పి వాటి ప్రకారమే చేయాలని అంటాడు. బుక్ క్రింద పడిపోతే తన శక్తిని కోల్పోతుందని చెబుతాడు. ఆ తరువాత వెంకటరమణకి ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయి? అందుకు తగినట్టుగా ఆ బుక్ లో అతను ఏమేం రాస్తూ వెళతాడు? అందువలన అతని జీవితంలో ఎలాంటి మార్పులు సంభవిస్తాయి? అనేదే కథ. శ్రీమంతుల ఆలోచనలు రకరకాలుగా ఉంటాయేమోగానీ, మిడిల్ క్లాస్ కుటుంబానికి చెందిన వాళ్లందరి ఆలోచనలు దాదాపు ఒకే రకంగా ఉంటాయని అంటారు. ఉమ్మడి కుటుంబం .. అవసరాలు .. అప్పుల మధ్యలో వాళ్లు సతమతమైపోతుంటారు. ఆ ఇబ్బందుల నుంచి బయటపడటం కోసం, సాధ్యమైనంత తొందరగా డబ్బు సంపాదించాలని ఆరాటపడతారు. అలా ఆశపడే వెంకటరమణ అనే పాత్ర చుట్టూ రాసుకున్న కథ ఇది. మిడిల్ క్లాస్ కుటుంబాలకు చెందినవారు జీవితం పట్ల భయము – భద్రత రెండూ కనబరుస్తూ ఉంటారు. తమకి సహకరించమని దేవుడి పాదాలను ఆశ్రయిస్తుంటారు. అలాంటి పరిస్థితులలో దేవుడే దిగి వచ్చి వాళ్లకు వరాలను ఇస్తే, వాళ్ల తలరాతను మార్చుకునే అవకాశం వారికే ఇస్తే ఎలా ఉంటుంది? అనే ఒక ఆలోచన నుంచి ఈ కథ పుట్టిందని చెప్పుకోవచ్చు. ఆర్థికపరమైన ఇబ్బందులతో ఉక్కిరిబిక్కిరయ్యే ఒక మధ్యతరగతి మానవుడికి, దేవుడే ప్రత్యక్షమై వరాలనిస్తే, అతను సద్వినియోగం చేసుకున్నాడా? దుర్వినియోగం చేసుకున్నాడా? అనే అంశం చుట్టూ ఈ కథ తిరుగుతూ వెళుతుంది. ఈ నేపథ్యంలో ప్రతి పాత్రను దర్శకుడు డిజైన్ చేస్తూ వెళ్లిన విధానం ఆడియన్స్ కి అవసరమైన వినోదాన్ని పంచుతుంది.మానవుడి కోరిక .. దేవుడి వరం అనే రెండు ప్రధానమైన అంశాలను టచ్ చేస్తూ సాగే ఈ కథ, బోర్ అనిపించకుండా సరదాగా సాగిపోతూ ఉంటుంది. తాము బాగుపడాలనే కోరికతో పాటు, ఇతరులు చెడిపోవాలనే మానవుల సహజమైన అసూయ ద్వేషాలను కూడా దర్శకుడు ఆవిష్కరించిన విధానం మెప్పిస్తుంది. ముఖ్యంగా దేవుడిచ్చిన బుక్ కోసం కొంతమంది స్వార్థపరులు ప్రయత్నించడం .. ఆ బుక్ చేతులు మారుతూ వెళ్లడం సరదాగా నవ్విస్తుంది. అలాగే స్వామివారే స్వయంగా ఆభరణాలు ఒలిచి ఇచ్చారని చెబితే కుటుంబ సభ్యులు నమ్మకపోవడం కూడా సరదాగా అనిపిస్తుంది. ఫస్టాఫ్ లో స్వామివారి ఆభరణాలకు సంబంధించిన సన్నివేశాలు, సెకండాఫ్ లో స్వామివారు ఇచ్చిన ‘బుక్’ కి సంబంధించిన సన్నివేశాలు ఆడియన్స్ కి కనెక్ట్ అవుతాయి. నాగేశ్వరరెడ్డి కామెడీపై తనకి గల పట్టును మరోసారి నిరూపించాడు. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఫరవాలేదు. గ్రాఫిక్స్ కి సంబంధించిన వర్క్ బాగుంది. శ్రీకాంత్ .. లయ .. రాజేంద్రప్రసాద్ నటన చాలా సహజంగా అనిపిస్తుంది. సునీల్ .. వెన్నెల కిశోర్ .. రఘుబాబు .. పృథ్వీ కామెడీ కూడా సందడి చేస్తుంది. దణ్ణం పెట్టుకోగానే దేవుడు ప్రత్యక్షమైతే .. కోరగానే కోరికలు తీర్చుకునే అవకాశం ఇస్తే బాగుంటుందని చాలామంది అనుకుంటారు. అలానే జరిగితే ఆ మనిషి ఎలాంటి ఇబ్బందులలో పడతాడో చూపించే కంటెంట్ ఇది. ఎవరికి ఏది ఇవ్వాలో .. ఎప్పుడు ఇవ్వాలో దైవానికి తెలుసు. ఆశపడిపోయి .. ఆరాటపడిపోయి పరుగులు పెడితే ఏం జరుగుతుందనేది వినోదభరితంగా ఆవిష్కరించిన సినిమా ఇది. ఇతరులకు సాయం చేసేవారికే, దేవుడు సాయం చేస్తాడనే ఒక సందేశాన్ని ఇచ్చే ఈ సినిమాను ఫ్యామిలీతో కలిసి సరదాగా చూడొచ్చు.

# రామ్ చరణ్ అన్నతో సినిమా చేయాలని ఉంది: వరుణ్ తేజ్

**చరణ్ అన్నయ్యతో కలిసి నటించాలని ఉందని చెప్పిన వరుణ్ తేజ్**

**‘కొరియన్ కనకరాజు’ హిట్‌తో ఐదేళ్ల నిరీక్షణ ఫలించిందన్న మెగా హీరో**

**‘గని’లా కాకుండా ‘బరి’ పక్కా స్పోర్ట్స్ డ్రామాగా ఉంటుందని వెల్లడి**

**కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో ఒక రొమాంటిక్ చిత్రానికి గ్రీన్ సిగ్నల్**

**భవిష్యత్తులో దర్శకత్వం చేసే ఆలోచన ఉందన్న వరుణ్**



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ తన సోదరుడు, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్‌తో కలిసి వెండితెరను పంచుకోవాలన్న తన ఆకాంక్షను వెల్లడించారు. ఇటీవల ‘కొరియన్ కనకరాజు’ చిత్రంతో విజయాన్ని అందుకున్న ఆయన, ఆ సంతోషాన్ని పంచుకుంటూ తన కెరీర్, భవిష్యత్ ప్రాజెక్టులకు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. గత ఐదేళ్లుగా ఆశించిన స్థాయిలో విజయాలు లేకపోవడంతో కొంత ఒత్తిడికి లోనయ్యానని, అయితే ‘కొరియన్ కనకరాజు’ చిత్రానికి ప్రేక్షకుల నుంచి లభించిన ఆదరణతో ఇప్పుడు ఎంతో ఊరటగా ఉందని వరుణ్ పేర్కొన్నారు. కేవలం ఒకే తరహా జోనర్‌లకు పరిమితం కావడం తనకు ఇష్టం ఉండదని, నటుడన్నవాడు ఏ పాత్రలోనైనా పరకాయ ప్రవేశం చేయాలని తాను నమ్ముతానని చెప్పారు. కరోనా అనంతర కాలంలో ఓటీటీ ప్రాధాన్యత పెరిగినప్పటికీ, థియేటర్‌లకు వచ్చే ప్రేక్షకులకు ఒత్తిడిని దూరం చేసేలా స్వచ్ఛమైన వినోదాన్ని అందించడం ఎంతో కీలకమని తాను గ్రహించినట్లు వివరించారు. త్వరలో విడుదల కానున్న స్పోర్ట్స్ డ్రామా ‘బరి’ గురించి ప్రస్తావిస్తూ, గతంలో తాను చేసిన ‘గని’ చిత్రంలో అనేక అంశాలను జోడించడం వల్ల కొంత గందరగోళం ఏర్పడిందని, అయితే ‘బరి’ మాత్రం పూర్తి క్రీడా నేపథ్యంతో ఎంతో వాస్తవికంగా ఉంటుందని వరుణ్ తేజ్ భరోసా ఇచ్చారు. ఈ చిత్ర ఆలోచన తన సోదరి నిహారిక నుంచి వచ్చిందని తెలిపారు. దీనితో పాటు, ప్రముఖ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో ఒక రొమాంటిక్ చిత్రానికి అంగీకరించానని, తన వయసుకు తగినట్లుగా ఉండే ఈ ప్రేమకథ విభిన్న శైలిలో ఉంటుందని వెల్లడించారు. రామ్ చరణ్ గురించి మాట్లాడుతూ, “చరణ్ అన్నయ్య అగ్ర కథానాయకుడు. తన సినిమాల కోసం ఆయన పడే శ్రమను చూసి నేను ఎంతో స్ఫూర్తి పొందుతుంటాను. చరణ్ అన్నతో కలిసి ఒక సినిమా చేయాలన్నది నా కోరిక” అని తన మనసులోని మాటను బయటపెట్టారు. తాను చిత్ర పరిశ్రమలోకి దర్శకుడు కావాలనే లక్ష్యంతో అడుగుపెట్టానని, భవిష్యత్తులో ఆ దిశగా తప్పకుండా అడుగులు వేస్తానని వరుణ్ తేజ్ స్పష్టం చేశారు.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449